ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
శనివారం 6 సెప్టెంబరు 2025



పెద్దేరు నుంచి 300 క్యూసెక్కుల నీరు విడుదల

మాడుగుల రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):
మండలంలోని పెద్దేరు జలాశయంలోని ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా శుక్రవారం సాయంత్రానికి 373 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 136.5 మీటర్లకు చేరింది. రాత్రి తొమ్మిది గంటలకు మూడో గేటు తెరిచి 300 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నట్టు ఏఈ సుధాకర రెడ్డి తెలిపారు. ఏజెన్సీ వర్షాలు కురుస్తుండడంతో గత మూడు వారాల నుంచి జలాశయంలోకి వరద నీరు వచ్చి చేరుతున్నది.ఆయకట్టుకు 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఖైదీల కలకలం

చోడవరం సబ్‌జైలు నుంచి ఇద్దరు రిమాండ్ ఖైదీల పరారీ


- ఘటన సమయంలో విధుల్లో సూపరింటెండెంట్, ఐదుగురు సిబ్బంది
- అయినా సరే వార్డర్‌పై దాడిచేసి సులువుగా తప్పించుకున్న ఖైదీలు
- తీవ్రంగా పరిగణిస్తున్న ఉన్నతాధికారులు
- సిబ్బంది అలసత్వం, నిర్లక్ష్యం కారణం



సబ్‌జైలు వార్డర్‌పై దాడి చేస్తున్న నిందితులు (సీసీ ఫుటేజీ)



వార్డర్‌పై దాడికి రిమాండ్ ఖైదీలు ఉపయోగించిన ఆయుధం ఇదే



చోడవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):
స్థానిక సబ్‌జైలులో రిమాండ్ ఖైదీలు శుక్రవారం సాయంత్రం వార్డర్‌పై దాడి చేసి, పారిపోయిన ఘటన జిల్లావ్యాప్తంగా కలకలం రేపింది. దీనిని జిల్లా పోలీసు అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. సబ్‌జైలు సూపరింటెండెంట్, ఐదుగురు సిబ్బంది విధుల్లో ఉన్నప్పటికీ వీరి అలసత్వం, నిర్లక్ష్యం కారణంగానే ఖైదీలు తప్పించుకున్నట్టు ఉన్నతాధికారులు గుర్తించారు. సబ్‌జైలులో పనుల కోసం రిమాండ్‌లో ఉన్న ఖైదీలను రోజూ బయటకు తీసుకురావడం, సాయంత్రం భోజనాల అనంతరం చీకటి పడకముందే వారిని తిరిగి సెల్‌లోకి పంపించడం తరచూ జరుగుతుంటుంది. అయితే రిమాండ్ ఖైదీలను సెల్ నుంచి బయటకు తీసుకువచ్చే సమయంలో జైలుకు ఉన్న ప్రధాన ద్వారంతోపాటు, దానికి ముందు ఉన్న మరో ద్వారాన్ని కూడా మూసి ఉంచాలి. కానీ శుక్రవారం సాయంత్రం ప్రధాన ద్వారానికి ముందున్న గేటు తెరిచి ఉండడంతో రిమాండ్ ఖైదీలు వంట గది నుంచి ఆయుధంతో వార్డర్ ఉన్న ప్రదేశానికి వచ్చి అతనిపై దాడి చేశారు. తరువాత అతని నుంచి తాళం గుంజుకుని పారిపోయినట్టు సీసీ కెమెరాల ఫుటేజీల ద్వారా స్పష్టంగా తెలుస్తున్నది. తనపై దాడి చేస్తున్న ఖైదీలను ప్రతిఘటించిన వార్డర్ వారిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ సబ్‌జైలు సూపరింటెండెంట్, ఐదుగురు గార్డులు ఏం చేస్తున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఘటన జరిగే సమయానికి వారంతా వివిధ పనుల్లో ఉన్నట్టు చెబుతున్నప్పటికీ, వారంతా ఒకేచోట ఉండి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండడంతో ఖైదీలు సులువుగా తప్పించుకోగలిగారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఖైదీలను బయటకు విడిచిపెట్టే సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండి వుంటే ఈ ఘటనకు అవకాశం ఉండేది కాదన్న అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. జైలు సిబ్బంది ఎవరెవరు ఏ సమయంలో ఎక్కడ ఉంటున్నారో గమనించిన ఇద్దరు రిమాండ్ ఖైదీలు.. పక్కాగా ప్లాన్ వేసి తప్పించుకోగలిగారని అంటున్నారు. సబ్‌జైలును ఆనుకొని పోలీస్ స్టేషన్‌తోపాటు రెవెన్యూ, పంచాయతీ, వివిధ ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. సబ్‌జైలు ప్రధాన రహదారిని ఆనుకుని ఉండడంతో జనసంచారం ఎక్కువగానే ఉంటుంది. అయినప్పటికీ

... మిగతా 8వ పేజీలో

సబ్‌జైలు నుంచి ఇద్దరు రిమాండ్ ఖైదీలు పరారీ

జైలు వార్డర్ తలపై సుత్తితో దాడి చేసి ఉడాయింపు

- ఒకరు పంచాయతీ కార్యదర్శి, మరొకరు చోరీ కేసుల్లో నిందితుడు

- వార్త మెయిన్ ఎడిషన్‌లో

గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా విశాఖ

- త్వరలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు
- సీఎం నారా చంద్రబాబునాయుడు

విశాఖపట్నం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):
గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా విశాఖపట్నం అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. నగరంలోని రాడిసన్ బ్లూ హోటల్‌లో 'ఏషియన్ సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్' శుక్రవారం నిర్వహించిన ఇంటర్నేషనల్ మీడియేషన్ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలోనే విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ పెడుతున్నదన్నారు. అదే సమయంలో వివిధ ప్రాంతాల్లో స్పేస్ సిటీ, డ్రోన్ సిటీలను కూడా అభివృద్ధి చేస్తున్నామన్నారు. రియల్ టైమ్ డేటా టెక్నాలజీని ఉపయోగించుకొని ఒక్క వాట్సాప్ ద్వారానే 700 సేవలు అందిస్తున్నామన్నారు.



ఇంటర్నేషనల్ మీడియేషన్ సదస్సుకు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ పీఎస్ నరసింహ

రెవెన్యూలో అవినీతి ఊడలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వాలు ఎన్ని వచ్చినా.. పాలకులు ఎంత మంది మారినా.. రెవెన్యూ శాఖలో అవినీతికి మాత్రం అడ్డుకట్ట పడడంలేదు. ఏ పని జరగాలన్నా ఆయా ఉద్యోగుల స్థాయిని, సంబంధిత పనినిబట్టి లంచం డిమాండ్ చేయడం ఆనవాయితీగా మారింది. అవినీతి నిరోధక శాఖ దాడుల్లో పట్టుబడుతున్నా, కేసులు నమోదు అవుతున్నా.. లంచాలు తీసుకోవడానికి మాత్రం వెరవడంలేదు. ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి, డబ్బులు దండుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మొత్తం మీద రెవెన్యూ శాఖలో అవినీతి ఊడలు బలంగా నాటుకుపోయాయి.

ప్రతీ పనికి ఓ రేటు

- లంచం ఇస్తేనే దరఖాస్తులకు మోక్షం
- వీఆర్వోలు, సర్వేయర్లే కీలక పాత్రం
- వసూలు చేసిన సొమ్ములో కింద నుంచి పైవరకు వాటాలు
- ప్రభుత్వాలు మారినా.. తీరుమారని రెవెన్యూ శాఖ
- ప్రక్షాళనకు దృష్టి సారించని పాలకులు



కశింకోట తహశీల్దారు కార్యాలయం

కశింకోట మండలం నర్సింగబిల్లి రెవెన్యూ జట్టపురెడ్డి తుని వీఆర్వో గన్నమరాజు శ్రీసూర్య కృష్ణ వృధ్వీ, ఓ రైతుకు వారసత్వంగా దఖలు పడిన భూమికి మ్యుటేషన్ చేసేందుకు గురువారం రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన నైనం రెవెన్యూ శాఖలో అవినీతిపై మరోసారి చర్చనీయాంశమైంది. దీనిపై సొంత శాఖలోనే కాకుండా ఇతర ప్రభుత్వ శాఖల్లో కూడా చర్చ జరుగుతున్నది. పట్టాదారు పాసు పుస్తకాల జారీ, భూ బదలాయింపు, భూ రికార్డుల్లో తప్పుల సవరణ, వారసత్వ ఆస్తి బదలాయింపు (మ్యుటేషన్), వివిధ రకాల ధ్రువపత్రాల జారీ.. ఇలా రెవెన్యూ పరంగా ఏ పనిజరగాలన్నా డబ్బులు ఇవ్వాల్సిందే. మ్యుటేషన్, పాసుపుస్తకాల జారీ కోసం ఎకరాకు రూ.10 వేలకు తక్కువ కాకుండా డిమాండ్ చేస్తున్నారు. భూమి విలువ ఎంత ఎక్కువ వుంటే.. లంచం రేటు అంత ఎక్కువ పెరుగుతుంది.

వీఆర్వోలు, సర్వేయర్లే కీలక పాత్ర!

వెబ్‌ల్యాండ్ లాగిన్ కీ తహశీల్దార్ల ఆధీనంలో

... మిగతా 8వ పేజీలో

ఎలమంచిలిలో వైరల్ జ్వరాలు

గొల్లలపాలెం ప్రాంతంలో పలువురు బాధితులు

- సీహెచ్‌సీకి జ్వర పీడితుల తాకిడి
- వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వినతి



సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న గొల్లలపాలెం జ్వరబాధితులు



సీహెచ్‌సీలో జ్వర బాధితురాలు ధన్యశ్రీ

ఎలమంచిలి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):
మునిసిపాలిటీలోని గొల్లలపాలెం వార్డులో వైరల్ జ్వరాలు విజృంభించాయి. ప్రతి ఇంటిలో కనీసం ఒకరు జ్వరంతో బాధపడుతున్నారు. కొన్ని కుటుంబాల్లో ఇద్దరు, ముగ్గురు జ్వర బాధితులు వున్నారు. సుమారు పక్షం రోజుల క్రితం వైరల్ జ్వరాలు మొదలవ్వగా, క్రమేపీ బాధితుల సంఖ్య పెరుగుతున్నది. దీంతో వైద్య సేవల కోసం సామాజిక ఆరోగ్య కేంద్రానికి క్యూ కడుతున్నారు. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న వారిని వార్డులో చేర్చి, వైద్య సేవలు అందిస్తున్నారు. మిగిలిన వారికి మందులు ఇచ్చి ఇంటికి పంపుతున్నారు. శుక్రవారం గొల్లలపాలేనికి చెందిన జ్వరబాధితులతో సీహెచ్‌సీలో కిటకిటలాడింది. కాళ్లు, చేతులు పీకుతున్నాయని, వారం రోజుల వరకు జ్వరం తగ్గడం లేదని బాధితులు అంటున్నారు. కొళాయి ద్వారా సరఫరా చేసే నీరు బురదగా వుండడంతో

... మిగతా 8వ పేజీలో

ఉపాధ్యాయులపై గురుతర బాధ్యత

పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దండి

- సమాజంలో ఉపాధ్యాయ వృత్తికే అధిక గౌరవం
- గురుపూజోత్సవంలో హోం మంత్రి అనిత
- జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం





సత్కారం పొందిన ఉత్తమ ఉపాధ్యాయులతో మంత్రి అనిత, ఎమ్మెల్యే కొణతాల, కలెక్టర్ విజయకృష్ణన్, డీఈవో అప్పారావునాయుడు, ఇతర ప్రముఖులు. (ఇన్‌సెట్‌లో) సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్. పక్కన కొణతాల, పీలా గోవింద, డీఈవో గిడ్డి అప్పలనాయుడు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):
విద్యార్థులను సన్మార్గంలో నడిపిస్తూ, వారిని ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపైనే వుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అని అన్నారు. శుక్రవారం స్థానిక గాంధీ నగరం ఎస్‌ఆర్ శంకరన్ భవనంలో గురు పూజోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద కలెక్టర్ విజయ కృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి అనిత మాట్లాడుతూ, సమాజంలో ఉపాధ్యాయులకు గౌరవం, గుర్తింపు అధికంగా వుంటాయని, అన్ని ఉద్యోగాల కంటే ఉపాధ్యాయ వృత్తి ఎక్కువ ఆత్మ సంతృప్తిని ఇస్తుందని తాను గతంలో ఉపాధ్యాయ వృత్తిలో వున్నానని, 12 ఏళ్ల క్రితం రాజకీయాల్లోకి వచ్చి నాయకురాలిగా ఎదిగానని గుర్తు చేశారు. ఇటీవల కాలంలో చిన్న పిల్లలు కూడా పోక్సో కేసుల్లో ఇరుక్కుంటున్నారని, ఇటువంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ, విద్యా విధానంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన సాగించాలని ఉపాధ్యాయులను కోరారు. టీచర్ల కృషి కారణంగానే గత విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అనకాపల్లి జిల్లా ఐదో స్థానంలో నిలిచిందన్నారు. అన్ని పాఠశాలల్లో యూత్ క్లబ్, సైన్స్ క్లబ్, మాదక ద్రవ్యాల నిరోధక కమిటీలను ఏర్పాటు చేయించినట్టు చెప్పారు. ప్రతి తరగతికి చెందిన

... మిగతా 8వ పేజీలో

రేపు మూడు గంటల వరకే

నూకాంబిక దర్శనం

- చంద్రగ్రహణం కారణంగా ఆలయం మూసివేత



బాలాలయంలో నూకాంబిక అమ్మవారు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):
సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయాన్ని ఆదివారం సాయంత్రం నుంచి మూసివేస్తున్నట్టు ఆలయ ఈవో కేఎల్ సుధారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల వరకే అమ్మవారి దర్శనం వుంటుందని, చంద్రగ్రహణం మునిగిన తరువాత సోమవారం ఉదయం ఆలయ సంప్రోక్షణ చేసి, తొమ్మిది గంటల నుంచి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తామని వెల్లడించారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర పర్యటన వాయిదా

చోడవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):
జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర జిల్లా పర్యటన వాయిదా పడిం ది. ముందుగా ప్రకటించిన మేరకు ఆయన శనివారం ఉదయం బుచ్చెయ్య పేట మండలం వడ్డాది, విజయరామరాజుపేట వద్ద కాజ్‌వేల మరమ్మతు పనులకు శంకుస్థాపన చేయాలి. తరువాత చోడవరంలో నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్‌ను ప్రారంభం, సీహెచ్‌సీలో వంద పడకల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయాల్సి వుంది. ఇంకా టీడీపీ కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం వుంది. అయితే అనివార్య కారణాల వల్ల మంత్రి పర్యటన వాయిదా పడిందని చోడవరం ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

ఘనంగా జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం



దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం సంయుక్త స్నాతకోత్సవాలు శుక్రవారం నోవాటెల్ హోటల్‌లో నిర్వహించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, వర్సిటీ చాన్స్‌లర్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పి.ఎస్.నరసింహ మాట్లాడుతూ న్యాయవాద పట్టాలతో బయటకు వస్తున్న విద్యార్థులు న్యాయస్థానాల ద్వారా సమాజానికి ఉపయోగపడాలన్నారు. సమాజంలో మార్పు తీసుకువచ్చేందుకు ప్రయత్నించాలన్నారు. ఈ సందర్భంగా 8, 9, 10, 11, 12వ బ్యాచ్‌లకు చెందిన 555 మంది విద్యార్థులకు పట్టాలు, 154 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్‌ను ప్రదానం చేశారు.

-వివరాలు మెయిన్, 8వ పేజీలో..

జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం సంయుక్త స్నాతకోత్సవంలో పాల్గొన్న సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పి.ఎస్.నరసింహ, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, యూనివర్సిటీ చాన్స్‌లర్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.సూర్య ప్రకాశరావు

జాతీయ రహదారిపై కూలిన చెట్టు

గంట పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం

- రంగంలోకి దిగి తొలగించిన రూరల్ పోలీసులు



రహదారిపై పడిన చెట్టును పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

కొత్తూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) :
అనకాపల్లి మండలం కొప్పాక వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం పెద్ద చెట్టు కూలిపోయింది. సాయంత్రం జరిగిన ఈ ఘటనతో గంటపాటు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రూరల్ పోలీసు స్టేషన్ సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ జి.రవికుమార్ రంగంలోకి దిగి చెట్టు తొలగింపునకు చర్యలు చేపట్టారు. సుమారు గంట తరువాత వాహనాలు యథావిధిగా నడిచాయి.

సాంకేతిక పరిజ్ఞానం మూలాలు మరువద్దు

▸▸ సైన్స్ అండ్ ఇండిజీనియస్ టెక్నాలజీ ఆన్ వీల్ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్


ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

అచ్యుతాపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నేటి సాంకేతిక పరిజ్ఞానానికి మూలాలను మరువరాదని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. కేంద్ర శాస్త్ర, సాంకేతిక విభాగం ఆర్థిక సహాయంతో మంజూరైన సైన్స్ అండ్ ఇండిజీనియస్ టెక్నాలజీ ఆన్ వీల్ ప్రాజెక్టును ఇక్కడి ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. భారతదేశం సాంకేతికతతో పాటు సంస్కృతీ సంప్రదాయాలకు నిలయమన్నారు. యాంత్రికీకరణ లేని రోజుల్లోనే భారతదేశంలో ఎన్నో అద్భుతాలు సృష్టించి జీవన శైలిని కొనసాగించారన్నారు. వివిధ మూలికలను ఉపయోగించి ఆయుర్వేద వైద్యాన్ని ప్రపంచానికి చాటింది భారతీయులేనని పేర్కొన్నారు. కేవలం చేతి నాడిని పట్టుకొని రోగనిర్ధారణ చేసే ప్రక్రియ కేవలం మన దేశంలోనే పుట్టిందని వివరించారు. నేడు టెక్నాలజీ పెరిగినా రోగ నిర్ధారణకు వైద్యులంతా యంత్రాలపై ఆధారపడుతున్నారన్నారు. ఎంత టెక్నాలజీ పెరిగినా మూలాలను మాత్రం విస్మరించరాదన్నారు. ప్రాజెక్టు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ మధుసూదనరావు మాట్లాడుతూ స్వదేశీ సాంకేతిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశ్యంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీనియర్ ఆర్‌ఎం డాక్టర్ కుమార సాహూ, మైభారత్ డీడీ జి.మహేశ్వరరావు, ప్రశాంతి విద్యా సంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మరాజుపేట పీఏసీఎస్ కార్యవర్గ ప్రమాణం


చైర్‌పర్సన్ జగ్గఅప్పారావును సత్కరిస్తున్న నాయకులు

అచ్యుతాపురం రూరల్, సెప్టెంబరు 5, (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరాజుపేట పీఏసీఎస్ కార్యవర్గం శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఎలమంచిలి సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఎం.నీలకంఠేశ్వరరావు చైర్‌పర్సన్ జగ్గ అప్పారావుతో పాటు సభ్యులు కాండ్రేగుల రమణ, బీశెట్టి గంగాధర్‌లతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వీరిని పలువురు పూలమాలలు, శాలువలతో సత్కరించారు. పీఏసీఎస్ అభివృద్ధి తమ వంతు కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జనపరెడ్డి శ్రీనివాసరావు, సర్పంచ్ శరగడం భాగ్యలక్ష్మి, శివబాపునాయుడు, ఉప సర్పంచ్ బీశెట్టి రాము, హరిపాలెం సర్పంచ్ మారిశెట్టి లక్ష్మీకాంతం, సూర్యనారాయణ, సంఘం మాజీ అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కర్రి ఆదిబాబు, కాండ్రేగుల అప్పారావు, యల్లపు గోవింద్, కర్రి భద్రరాజు, వెంకునాయుడు, నాగార్జున, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

నడింపల్లి బడిలో భయం.. భయం..

▸▸ శిథిలావస్థకు చేరిన భవనం ▸▸ శ్లాబ్ నుంచి పెచ్చులూడి పడుతుండడంతో హడలిపోతున్న విద్యార్థులు ▸▸ అధికారులు స్పందించాలని వేడుకోలు


చితుకు చితకుమంటూ చదువులు సాగిస్తున్న విద్యార్థినీ విద్యార్థులు


శిథిలావస్థకు చేరిన నడింపల్లిలోని ప్రాథమిక పాఠశాల భవనం

అచ్యుతాపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నునపర్తి పంచాయతీ శివారు నడింపల్లి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల భవనం భయపెడుతోంది. శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అంతా ఆందోళన చెందుతున్నారు. చిన్నపాటి వర్షానికి సైతం నీరు కిందకు జారుతుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు భవనం శ్లాబ్ పెచ్చులూడి ఇనుప ఊచలు బయటకు కనిపిస్తుండడంతో మరింత హడలిపోతున్నారు. సుమారు మూడున్నర దశాబ్దాల క్రితం ఈ భవన నిర్మాణాన్ని చేపట్టారు. దీని నిర్వహణను సరిగా పట్టించుకోక పోవడంతో నేడు ఈ దుస్థితికి చేరుకుంది. గత వైసీపీ ప్రభుత్వం నాడు- నేడు పథకంతో పాఠశాలల రూపురేఖలు మార్చేస్తున్నామని ఊకదంపుడు ప్రసంగాలు చేసిందే తప్ప, తమ గ్రామంలోని పాఠశాల భవనాన్ని పట్టించుకోలేదని అక్కడివారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో భవనం పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఈ భవనంలో రెండు గదులు ఉండగా ఒక గది పూర్తిగా పాడైంది. పెచ్చులూడి పడుతుండడంతో విద్యార్థులు ఎక్కడ గాయాలకు గురవుతారోనని తలంచి ఉపాధ్యాయులు ఒకే గదిలో విద్యార్థులందరినీ కూర్చోబెడుతున్నారు. ఒకప్పుడు ఇక్కడ పద్దెనిమిది మంది విద్యార్థులు ఉండగా, పాఠశాల దుస్థితిని చూసి భయపడిన తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించారు. దీంతో ఇక్కడ ప్రస్తుతం ఎనిమిది మంది మాత్రమే చదువుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి పాఠశాల భవనం స్థానంలో కొత్త భవనాన్ని నిర్మించాలని అంతా కోరుతున్నారు. కనీసం కొత్తగా రేకుల షెడ్డు నిర్మిస్తామన్నా స్థలాన్ని కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని గ్రామస్థులు తెలిపారు.


పెచ్చులూడి, ఊచలు కనిపిస్తున్న భవనం శ్లాబ్

రైతులకు అందుబాటులో ఎరువులు : ఏవో సమంత

రాంబిల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందవద్దని, రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత అన్నారు. శుక్రవారం ఇక్కడ ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. మండలంలో వరి సాధారణ విస్తీర్ణం 5,653 ఎకరాలు కాగా, ఇప్పటికే 2,767 ఎకరాల్లో వరినాట్లు పూర్తయినట్టు చెప్పారు. ఈ నెలాఖరుకు పూర్తిస్థాయిలో నాట్లు పడనున్నాయన్నారు. రైతుసేవా కేంద్రాల ద్వారా 197 టన్నులు, ప్రవేటు డీలర్ల ద్వారా 30 టన్నుల యూరియాను ఇప్పటికే రైతులకు సరఫరా చేసినట్టు చెప్పారు. ప్రస్తుతం మురకాడ, గోకివాడ, పంచదార్లలోని రైతు సేవా కేంద్రాల్లో 21 టన్నుల యూరియా, రాంబిల్లి, మామిడివాడ రైతు సేవా కేంద్రాల్లో 36 టన్నుల డీఏపీ అందుబాటులో ఉన్నట్టు వివరించారు. అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

ఘనంగా గురు పూజోత్సవం


రామ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో విద్యార్థులు

ఎలమంచిలి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పలు విద్యాలయాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని రామ్‌నగర్‌లో గల అంగన్‌వాడీ కేంద్రంలో తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి అంతా పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చిన్నారులు మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్, ఝాన్సీలక్ష్మీభాయ్ తదితర స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో అలరించారు. విద్యార్థుల తల్లిదండ్రులంతా కలిసి అంగన్‌వాడీ కేంద్రం టీచర్ రత్నంను ఘనంగా సత్కరించారు.

మునగపాక, : మండలంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో గురు పూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మునగపాకలోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో నేషనల్ జూనియర్ కళాశాల, నాగులాపల్లిలో పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జూనియర్ కళాశాలకు చెందిన ఇద్దరు పూర్వ విద్యార్థులు దొడ్డి నూకభాగ్య సరోజిని, ఐ.హేమలు ఇటీవల ప్రకటించిన డీఎస్సీలో విజయం సాధించడంతో వారిని యాజమాన్యం సత్కరించింది. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబి వేడుకలు

ఎలమంచిలి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహ్మద్ ప్రవక్త జయంతిని పట్టణంలో ముస్లింలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త దైవాంశ సంభూతుడుగా పేర్కొన్నారు. అంతా ఆయన చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రధాన రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

'గ్రామాల్లో పారిశుధ్య సమస్య పరిష్కరించాలి'


మాట్లాడుతున్న దేముడునాయుడు

రాంబిల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్య సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు కోరారు. శుక్రవారం ఇక్కడ ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో పారిశుధ్య సమస్య ఉన్నట్టు చెప్పారు. ఎక్కడ బడితే అక్కడ చెత్త పేరుకుపోయి ఉంటుండడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించాలని విన్నవించారు. అలాగే, కాలువల్లో పూడికలను తొలగించాలన్నారు. ఈ సమావేశంలో పలువురు సీపీఎం, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

అప్పన్నపాలెంలో వినాయక విగ్రహం నిమజ్జనం

రాంబిల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి వేడుకల్లో భాగంగా అప్పన్నపాలెం కాలనీలోని సాయిబాబా మందిరంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని శుక్రవారం మేళతాళాల నడుమ ఊరేగించి నిమజ్జనం చేశారు. తొలుత టీడీపీ మండల మాజీ ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబు, కాలనీ యువకులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకు వెళ్లి సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు.

మునగపాక : నాగులాపల్లిలో గల చెరువులో శనివారం పెద్ద ఎత్తున వినాయక విగ్రహాలు నిమజ్జనం చేయనున్న సందర్భంగా భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆ ప్రాంతాన్ని తీర్చిదిద్దినట్టు ఎంపీటీసీ మళ్ల కాశీసురేష్ తెలిపారు. నిమజ్జనం సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

గెడ్డం బుజ్జికి ఎమ్మెల్యే గంటా పరామర్శ


గుంటపల్లిలో బుజ్జిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గంటా, తాతయ్యబాబు

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటపల్లి గ్రామంలో జనసేన నాయకుడు గెడ్డం బుజ్జిని శుక్రవారం భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు పరామర్శించారు. ఇటీవల గెడ్డం బుజ్జి గుండె సంబంధిత శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఈ మేరకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తులతో తాతబాబుతో కలిసి గుంటపల్లి బుజ్జి ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా బుజ్జి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గొర్లె రాజుబాబు, గెడ్డం కన్నబాబు, గెడ్డం చైతన్య, గెడ్డం ఆకాశ్, వెలగా సుధాకర్, ఆచంట దొర, గీసాల పద్మ, తదితరులు పాల్గొన్నారు.

నాటక అకాడమీ డైరెక్టర్ పల్లాకు సత్కారం


పల్లా విలియంకేరిని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

పాయకరావుపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్‌గా నియమితులైన టీడీపీ సీనియర్ నాయకుడు పల్లా విలియంకేరిని నాయకులు ఘనంగా సత్కరించారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విలియంకేరిని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను తదితరులు సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొంది కాశీవిశ్వనాథం, కె.వెంకటేశ్వరరావు, చింతకాయల రాంబాబు, జూరెడ్డి ప్రసాద్, ఎం.వెంకటరమణ, గారా కృష్ణప్రసాద్, వేములపూడి అప్పారావు, గుల్లా నాగరాజు, గొర్ల లక్ష్మీనారాయణ, కట్టా శ్రీను, సారధి గిరిధర్, దువ్వి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుటేరు కాలువపై కల్వర్టు నిర్మించాలి


కల్వర్టు నిర్మించాల్సిన ప్రదేశం ఇదే..

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంటకోట రోడ్డు నుంచి ఉప్పుటేరు కాలువ అవల పొలాలకు వెళ్లడానికి కల్వర్టును నిర్మించాలని రైతులు కోరుతున్నారు. వర్షాకాలం, ఉప్పుటేరులో నీరు ఎక్కువగా ఉన్నప్పుడు రైతులు పొలాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలువపై గతంలో రైతులందరూ కలిసి తమ సొంత నిధులతో తూరలు వేసి దానిపై మట్టి వేసి రోడ్డును నిర్మించుకున్నారు. అయితే వర్షాకాలంలో మాత్రం రోడ్డు మొత్తం నీటిలో మునిగిపోవడమే కాకుండా మట్టి రోడ్డు నీటిలో కొట్టుకు పోతుండడంతో రైతులు అవల ఒడ్డుకు వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నారు. పొలాలకు వెళ్లడానికి, పంటను తీసుకురావడానికి రోడ్డు నిర్మించాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలోని అన్ని మండలాల్లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాయకరావుపేట మండలంలోని గుంటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడు తెనాలి రవికుమార్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, డీఈవో అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


నక్కపల్లి: అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు సతీశ్


కోటవురట్లలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు

నక్కపల్లిలో...

నక్కపల్లి,సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు విద్యార్థినీ, విద్యార్థులే ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించారు. హెచ్‌ఎం వి.బాలాజీని ఉపాధ్యాయులను సత్కరించి వారి ఆశీస్సులు పొందారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను హెచ్‌ఎం వివరించారు. కార్యక్రమంలో రవీంద్రనాథ్‌ఠాగూర్ ఆంగ్ల క్లబ్ వ్యవస్థాపకుడు వై.వెంకట రమణ, ఉపాధ్యాయులు ఎం.సాంబశివారు, ఎన్.సాంబశివారావు, ఎం.ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు పొందిన పలువురు గురువులకు జిల్లా కేంద్రంలో శుక్రవారం హోం మంత్రి అనిత, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కలెక్టర్ విజయ్ కృష్ణన్ ఘనంగా సత్కరించారు. డీఎల్‌పురం-1 ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న కాళింగ సతీశ్, దేవవరం స్కూల్‌లో పనిచేస్తున్న డీఆర్‌కే శాస్త్రి, నక్కపల్లి బాలికల ఉన్నత పాఠశాల సోషల్ టీచర్ ఎ.సత్యవతి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు పొందారు.

కోటవురట్లలో...

కోటవురట్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి జ్యోతి ప్రజల్వన చేసి పూలమాలతో నివాళిర్పించారు. స్థానిక కోటవురట ఉన్నతపాఠశాల టీచర్స్‌హెచ్‌ఎం ఎస్ సుకుమార్‌ను సిబ్బంది ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో గురుపూజ ఉత్సవాలు జరిగాయి.


పాయకురావుపేట: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న రవికుమార్

ఎస్.రాయవరంలో...

ఎస్. రాయవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఏవీ రామాచార్యులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. దీనికి సంబంధించి శుక్రవారం అనకాపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తదితరుల చేతుల మీదగా తనను సన్మానించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు చెందిన ప్రశంసాపత్రాన్ని అందజేయడం జరిగిందని ఏవీ రామాచార్యులు తెలిపారు.


ఎస్.రాయవరం: అవార్డు అందుకున్న ఏవీ రామాచార్యులు

నానో యూరియా ప్రయోజనకరం

వ్యసాయాధికారి సౌజన్య


5ఎస్‌ఆర్‌వీఎం1)ఉప్పరాపల్లిలో డ్రోన్‌తో నానో యూరియా పిచకారీ విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా వినియోగం వల్ల రైతులకు ఎన్నో లాభాలు చేకూరుతాయని మండల వ్యవసాయాధికారిణి సౌజన్య చెప్పారు. మండలంలో ఉప్పరాపల్లి గ్రామంలోని వరి పొలాల్లో శుక్రవారం డ్రోన్‌తో నానో యూరియా, నానో డీఏపీ పిచికారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో సౌజన్య మాట్లాడుతూ నానో యూరియా వినియోగం వల్ల వ్యవసాయం సులభతరంతో పాటు నాణ్యమైన ఆహారం పండివచ్చన్నారు. రసాయ ఎరువులు తగ్గింపు, పర్యావరణ పరిరక్షణ వంటి తదితర లాభాలు ఉన్నాయన్నారు. రైతులంతా నానో యూరియా, నానో డీఏపీ వంటి ఉత్పత్తులను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. నానో యూరియా పిచకారీకి కావలసిన డ్రోన్ సర్వీస్ అందుబాటులో ఉందన్నారు. డ్రోన్ కావాలసిన రైతులు గ్రామాల్లో ఉన్న సంబంధిత రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. అంతక ముందు నానో యూరియా, నానో డీఏపీ డ్రోన్‌తో పిచికారీ చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్‌పర్సన్ తుమ్మపాల నాగేశ్వర రావు, నాయకులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో అనారోగ్యంతో బాధపడుతున్న మూడు కుటుంబాలకు వైద్య ఖర్చుల కోసం మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధిత కుటుంబాలకు రూ.1,23,074 చెక్కులను టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు ప్రదీప్ మాట్లాడుతూ ఆరోగ్యంతో బాధపడుతున్న మండలంలోని రాజానగరం గ్రామానికి చెందిన సిరిపిల్లి రాజుకి రూ.49,154, గరికిన శ్రీనుకి రూ.45,000, మంగవరం గ్రామానికి చెందిన కుందూరు మహాలక్ష్మికి రూ.28,920 సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైనట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొంది కాశీవిశ్వనాథం, మజ్జూరి నారాయణరావు, మలిపెద్ది వెంకటరమణ, వేములపూడి అప్పారావు, గొల్లపల్లి నాగు, కట్టా శ్రీను, వంకా శివ, హరి తదితరులు పాల్గొన్నారు.

నేడు శారదా నదిలో నిమజ్జన ఘట్టం

▸▸ ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే కొణతాల ఆదేశం

▸▸ ఘాట్ వద్ద పరిస్థితి పరిశీలన



నిమజ్జన ఘాట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి శారదా నది ఒడ్డున గల వినాయక నిమజ్జన ఘాట్‌ను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ శుక్రవారం పరిశీలించారు. శనివారం భారీ ఎత్తున వినాయక విగ్రహాలు నిమజ్జనం జరగనున్న నేపథ్యంలో సామూహిక వినాయక నిమజ్జనోత్సవ కమిటీ, గణేష్ ఉత్సవ కమిటీతో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. విగ్రహాల నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పార్కు పక్క నుంచి వచ్చే వాహనాలు తిరిగి రెండో మార్గంలో ఉన్న పాత అన్నమయ్య పార్కు పక్క నుంచి వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని పోలీసులకు ఎమ్మెల్యే సూచించారు. అలాగే, రానున్న కార్తీకమాసంలో భక్తుల పవిత్ర స్నానాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం వెనుక భాగంలో ఉన్న ప్రాంతాన్ని ఒక ప్లాట్‌ఫారంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సామూహిక వినాయక నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి, గణేష్ ఉత్సవ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విల్లూరి శ్రీనివాసరావు, కూటమి నాయకులు ఆళ్ల రామచంద్రరావు, తాడి రామకృష్ణ, దూలం గోపి, మంగ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

9న రైతుల సమస్యలపై నిరసన : అమర్‌నాథ్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎరువుల కొరతపై ఈ నెల తొమ్మిదో తేదీన ఆర్డీవో కార్యాలయం వద్ద వైసీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. ఇక్కడి రింగు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులోకి తీసుకు రావడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. జిల్లాలో ఎరువుల పంపిణీ పరిస్థితి దారుణంగా ఉందని ఆరోపించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, దంతులూరి దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

సబ్బవరం : కూటమి ప్రభుత్వం రైతులను విస్మరించిందని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆరోపించారు. శుక్రవారం ఇక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడారు. రైతుల సమస్యలపై ఈనెల తొమ్మిదిన అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు కర్రి బాబు, బోకం రామునాయుడు, కొటాన రాము, గండి రవికుమార్, పాలిశెట్టి సురేశ్‌రాజ్, కర్రి అప్పారావు, గొర్లి రాజేశ్, చొప్పా నాగరాజు, యడ్ల నాయుడు, హేమంత్ కుమార్, శీలం నదియా, పెద్దిశెట్టి శేఖర్, వాసు, శ్రీను పాల్గొన్నారు.

సమస్యలపై పారిశుధ్య కార్మికుల ఆందోళన



ఇన్‌చార్జి ఎంపీడీవో ధర్మారావుకు వినతిని అందిస్తున్న పారిశుధ్య కార్మికులు

కశింకోట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికులకు రూ.నాలుగు వేలు చొప్పున మెడికల్ అలవెన్సులు అమలు చేయాలని పంచాయతీ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఇక్కడి పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం వానే నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, పంచాయతీ కార్మిక యూనియన్ నాయకులు కొండబాబు, చంద్రశేఖర్ మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని వారం రోజుల క్రితం జిల్లా పంచాయతీ అధికారి సందీప్‌కు వినతిపత్రం అందజేసినా నేటి వరకు ఫలితం లేకపోయిందన్నారు. మే నుంచి ఆగస్టు నెల వరకు బకాయి జీతాలు, మెడికల్ అలవెన్సు చెల్లించాలని, పర్మినెంట్ చేయాలని, అర్హులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జి ఎంపీడీవో ధర్మారావుకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు సూరి అప్పారావు, వైసన్యాసమ్మ, అప్పలకొండ, పోలయ్య, చిలకమ్మా, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆవఖండం అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి



మాట్లాడుతున్న ఆవఖండం పరిరక్షణ వేదిక కన్వీనర్ భద్రం

తుమ్మపాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి ఆవఖండంలో జరుగుతున్న అక్రమాలకు అధికారులు తక్షణమే అడ్డుకట్ట వేయాలని ఆవఖండం పరిరక్షణ వేదిక కన్వీనర్ వై.ఎస్.భద్రం డిమాండ్ చేశారు. ఇక్కడి సీపీఐ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఆవఖండంలో అక్రమాలను అడ్డుకుంటామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ప్రకటన చేసి మూడు నెలలు గడుస్తున్నా కార్యరూపం దాల్చలేదని ఆరోపించారు. దీంతో అక్రమ నిర్మాణాలు ఊపందుకున్నాయన్నారు. అధికారుల కనీస పర్యవేక్షణ లేకపోవడంతో రియల్టర్లు బరితెగిస్తున్నారని మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించిఆవఖండాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆవఖండం పరిరక్షణ సమితి నాయకులు గాడి బాలు, కనిశెట్టి సురేష్‌బాబు, కోరిబిల్లి శంకరరావు, శేఖరమంత్రి సాయి, లక్ష్మణ్, తాకాశి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలు పంపిణీ



ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు పత్రాలు అందిస్తున్న నాయకులు

తుమ్మపాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఊడేరు పంచాయతీ పరిధి అల్లిఖానుడుపాలెంలో ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు పత్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు అంజనీ చౌదరి, చదరం నాగేశ్వరరావు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు బాసటగా నిలిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల నాయకులు గంగుపాం జగదీష్, ఇంటి తాతారావు, సిరిగిరిశెట్టి రాజేష్, సిరిగిరిశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రత్నాకర్



కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాలలో...



కశింకోటలో ఉపాధ్యాయులను సన్మానించిన వాసవీ క్లబ్ ప్రతినిధులు

గురువులకు వందనం

▸▸ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఘనంగా గురు పూజోత్సవం ▸▸ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాలు, చిత్రపటాల వద్ద నివాళి

అనకాపల్లి టౌన్/ అనకాపల్లి రూరల్/ కొత్తూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గురు పూజోత్సవాన్ని అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లోని పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలు, విగ్రహాలకు గురువులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనకాపల్లి మెయిన్ రోడ్డులో గల డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జూనియర్ కళాశాలలో జరిగిన ఈ వేడుకలను కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ జ్యోతి ప్రజ్వలన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు నూతన నైపుణ్యాలను పెంపొందించుకుంటూ విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. అనంతరం పలువురు అధ్యాపకులను సత్కరించారు. ప్రిన్సిపాల్ కోరిబిల్లి అప్పలనాయుడు, డీవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్, అధ్యాపకులు కె.జగదీష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, కొత్తూరులోని ఏఎంఏఎల్ కళాశాలలో గురు పూజోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ పెంటకోట వెంకటరామారావు హాజరై రాధాకృష్ణన్ విగ్రహానికి



సబ్బవరంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా సత్కారం పొందిన వారితో ఎంపీపీ సూర్యకుమారి, తదితరులు

పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యక్షుడు శ్రీధరాల కృష్ణపేర్రాజు మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయునికి ఉన్నతమైన స్థానం ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.జయబాబు మాట్లాడుతూ సర్వేపల్లి జీవిత విశేషాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గవర్నింగ్ బాడీ సభ్యులు కర్రి శివ, పెంటకోట ఉమా మహేశ్వరరావు, బాలకృష్ణ, వాసిరెడ్డి బాలకృష్ణ, సూపరింటెండెంట్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

వాసవిక్లబ్ ఆధ్వర్యంలో...

కశింకోట : వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఇక్కడ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను, అంగన్‌వాడీ కార్యకర్తలను సత్కరించారు. అనంతరం క్లబ్ కార్యదర్శి డీవీకే గుప్తా, జిల్లా అధికారి కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతికి తరగతిలోనే పునాది పడుతుందన్నారు. వారిని తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అమోఘమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, సురేష్‌కుమార్, వై.శ్రీనివాసరావు, వి.రమేష్, ఉపాధ్యాయులు కమల, మల్లేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరంలో...

సబ్బవరం : మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురు పూజోత్సవాన్ని ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఎంపీపీ బోకం సూర్యకుమారి ముఖ్య అతిథిగా హాజరై డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించిన పది మంది గురువులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గురువులు మార్గదర్శకులన్నారు. సమాజంలో వారికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. వారిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు లక్ష్మణరావు, రవీంద్రబాబు, సర్పంచ్ దెడ్డం ప్రసాద్, ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు, బోకం రామునాయుడు, కొటాన రాము, ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు అప్పలనాయుడు, ప్రసాదరావు, కేవీ రమణ, హేమంత్, వనం భాస్కరరావు, పీవీ ఆనంద్, సత్యంనాయుడు, కనకారావు, కృష్ణ, శ్రీను, సుధాకర్, కరీముల, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సబ్బవరంలోని ఎరువులు తహశీల్దార్ తనిఖీలు

రైతులకు అందుబాటులో యూరియా

▸▸ జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు వెల్లడి ▸▸ వైసీపీ దుష్ప్రచారం రైతులు నమ్మవద్దని కూటమి నేతల పిలుపు



తాళ్లపాలెంలో దుకాణం వద్ద మాట్లాడుతున్న కూటమి నాయకులు



నాయుడుపాలెంలో సిద్ధం చేసిన యూరియాను పరిశీలిస్తున్న అధికారులు

తుమ్మపాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని రైతాంగానికి అవసరమైన యూరియాను సిద్ధం చేసినట్టు జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు తెలిపారు. తుమ్మపాలకు చేరిన యూరియా బస్తాల నిల్వలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే తుమ్మపాల ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు మాట్లాడుతూ యూరియా కొరత ఉందని పలు రాజకీయ పార్టీల నాయకులు చేసిన ప్రచారాన్ని రైతులు నమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రంగాచారి, డీటీ శాంతిభూషణ్, జనసేన పార్టీ కోర్ కమిటీ సభ్యుడు పీలా తాతునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలో ఎలాంటి యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని కూటమి నాయకులు కర్రి సత్యనారాయణ, ఉగ్గిన రమణమూర్తి, ఉల్లింగల రమేష్ తదితరులు స్పష్టం చేశారు. శుక్రవారం వారు తాళ్లపాలెంలో ఉన్న ఎరువుల దుకాణంలో అందుబాటులో ఉన్న ఎరువులు, యూరియా వివరాలను అడిగి తెలుసుకున్నారు. యూరియా కొరత ఉందంటూ వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కలగా గోవింద, కలగ సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ బి.చిన్నికృష్ణ హెచ్చరించారు. మండల కేంద్రం సబ్బవరంలోని పలు ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో శుక్రవారం ఎంపీడీవో పి.పద్మజ, వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణతో కలిసి తనిఖీలు నిర్వహిచారు. రికార్డులను పరిశీలించి, స్టాక్ వివరాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎరువులు కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఇబ్బందులకు గురిచేసినా, ఎక్కువ ధరలకు విక్రయించినా అటువంటి షాపుల లైసెన్స్‌లను రద్దు చేస్తామని స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన ఎరువులను ప్రభుత్వం అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. ఏవో పోతల సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఏడాది 1338 హెక్టార్ల సాధారణ వరి సాగు విస్తీర్ణం కాగా ఇప్పటికి 1212 హెక్టార్లలో నాట్లు పడ్డాయన్నారు. అందుకు తగిన యూరియాను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వీరయ్య, వీఆర్వో డి.ఈశ్వరరావు, ఎఈవో బాలరాజు పాల్గొన్నారు.

పరవాడ : రైతులకు అవసరమైన యూరియాను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామని తహశీల్దార్ బి. నాగరాజు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మండల వ్యవసాయాధికారిణి రమాదేవితో కలిసి నాయుడుపాలెం, పెదముషిడివాడలలో గల రైతు సేవా కేంద్రాలను సందర్శించారు. ఆయా కేంద్రాల్లో ప్రభుత్వం రైతుల కోసం సిద్ధం చేసిన యూరియాను పరిశీలించారు. అలాగే పరవాడలో గల ప్రైవేటు ఎరువుల దుకాణాలను సందర్శించారు. ఎంఆర్‌పీ ప్రకారమే విక్రయాలు జరపాలని దుకాణాల యజమానులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబి వేడుకలు

కశింకోట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మహ్మద్ ప్రవక్త జయంతిని మండల కేంద్రం కశింకోటలో శుక్రవారం ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూర్ మసీదు అధ్యక్షుడు షేక్ రెహ్మాన్ (బాబర్) మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్రను వివరించారు. ముందుగా బయ్యవరం అన్సర్ మదినీ ఔలియా దర్గా నుంచి కశింకోట నూర్ మసీదు వరకు ర్యాలీ చేపట్టారు. గ్రామ పురవీధుల గుండా ఈ ర్యాలీ కొనసాగింది. అనంతరం నూర్ మసీదులో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ ఖలీమ్ ఆజాద్, మౌలానా నసీం





కశింకోటలో ర్యాలీ చేస్తున్న మత పెద్దలు, ముస్లింలు

అక్తర్, నూర్ మసీద్ కార్యదర్శి ఎస్ఎంఎం ఆలీ, ఎంఏ రబ్బానీ, నూర్ నబి, ముస్తఫా ఆలం, ఫజిల్ రెహ్మాన్, ఐఎం షరీఫ్, సయ్యద్ సలీం తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

'సీఐటీయూ జిల్లా మహా సభలను విజయవంతం చేయండి'

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చోడవరంలో శని, ఆదివారాల్లో జరగనున్న సీఐటీయూ జిల్లా మహా సభలను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఇక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై చర్చించడంతో పాటు భవిష్యత్తు పోరాటాలపై ప్రణాళికలను మహా సభల్లో రూపొందించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కె.లోకనాథం, కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాజులవానిపాలెం- కలపాక రోడ్డులో ప్రయాణం భయం.. భయం..

▸▸ ప్రమాదకరంగా మలుపులు

▸▸ ఆందోళన చెందుతున్న వాహనదారులు

▸▸ రేడియం స్టిక్కర్లు, హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు వినతి



పరవాడలోని కోళ్లఫారాల సమీపంలో...



గ్లోబల్ స్కూల్‌కు వెళ్లే రహదారికి సమీపంలో ప్రమాదకరమైన మలుపు

పరవాడ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాజులవానిపాలెం నుంచి పి.బోనంగి, వీఎల్ఎన్ పురం, మరిసవానిపాలెం మీదుగా కలపాక గ్రామాలకు వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో ప్రయాణం అంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. పలుచోట్ల మలుపులు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. వేగంగా రాకపోకలు సాగించే వాహనచోదకులు ఈ మలుపుల వద్ద అదుపు తప్పుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనికితోడు రహదారికి ఇరువైపులా ముళ్ల పొదలు పెరిగిపోవడంతో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ముఖ్యంగా స్థానిక కోళ్లఫారాల సమీపంలోని మలుపులతో పాటు పి.బోనంగి గ్లోబల్ స్కూల్‌కు వెళ్లే రహదారికి ఆనుకొని ఉన్న మలుపు వాహనదారులను బెంబేలెత్తిస్తుంది. దీంతో మలుపుల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపులు వద్ద రేడియం స్టిక్కర్‌తో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

గణనాథుడ్ని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే పీలా



స్వామిని దర్శించుకుంటున్న పీలా గోవింద, సురేంద్ర

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గవరపాలెం నీలకంఠరావు వీధిలో వరసిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడ్ని శుక్రవారం రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ప్రారంభించారు. అలాగే అనకాపల్లిలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో పూజలు జరిపారు. నాయకులు పోలారపు త్రినాథ్, పీడీ ప్రసాద్, నిర్వాహకులు కోట్ని దుర్గా, నంద్యాల హరీష్, ఎస్.భానుచందర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : ఇక్కడి భవానీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో స్వామివారిని శుక్రవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆయనను సత్కరించారు. కూటమి నాయకులు వేగి దొరబాబు, దాసరి బాబు, వేగి పవన్, వేగి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ అదృశ్యంపై కేసు నమోదు

లంకెలపాలెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్ అదృశ్యంపై పరవాడ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాలివి. జీవీఎంసీ 84వ వార్డు పరిధి సాలాపువానిపాలెం గ్రామానికి చెందిన గెంజి రాజు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల మూడో తేదీన రాజు తన ఆటోను ఇంటి వద్ద పార్కు చేసి అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు అతని కోసం ఎంత వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో అతని భార్య సంధ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.


కలెక్టర్‌నుంచి అవార్డు అందుకుంటున్న మోహనరావు | మీనా | రాంబాబు | గోపాలం | నాగరత్నం


జీకే వీధి మండలం జెర్రెలలో రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

గురుభ్యోనమః

- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం
- ఉపాధ్యాయులకు రాష్ట్ర, జిల్లా స్థాయి పురస్కారాల ప్రదానం


సీలేరులో సీనియర్ ఉపాధ్యాయిని రత్నకుమారికి సన్మానం


చింతపల్లిలో సీనియర్ ఉపాధ్యాయుడు వీరన్నపడాల్‌ని సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

అరకులోయ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గురుపూజోత్సం సందర్భంగా మండలంలో ముగ్గురు ఉపాధ్యాయులను ఉత్తమ అవార్డులకు ప్రభుత్వం ఎంపిక చేసింది. అరకులో యలోని కంటబౌంసుగుడ గిరిజన సంక్షేమశాఖబాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో పనిచేస్తున్న శెట్టి రోజారాణి రాష్ట్రస్థాయి ఉత్తమఅవార్డు పొందగా, అరకులోయ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మోహనరావు, అదే పాఠశాలలో ఇంగ్లీషు టీచర్‌గా పనిచేస్తున్న కె.మీనా జిల్లాస్థాయి పురస్కారాలు పొందారు. వీరిద్దరూ శుక్రవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ దినేశ్‌కుమార్, డీఈవో బ్రహ్మాజీలనుంచి అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మోహనరావు మాట్లాడుతూ.. ఒకే స్కూల్ నుంచి ఇద్దరు అవార్డులు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో, విలువలతో కూడిన నాణ్యమైన విద్యనం దించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. శెట్టి రోజారాణిని రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంపై పలువురు హర్షం వ్యక్తంచేస్తున్నారు. అరకులోయ గుకుకుల బాలికల ఆశ్రమోన్నత పాఠశాల లో పనిచేస్తున్న ముమ్మన నాగరత్నం (పీజీటీ మ్యాథ్స్) జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. యండపల్లివలసలో ఆమె ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు.

కొయ్యూరు: మండలంలో రాజేంద్రపాలెం బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం గోపాలం, కొయ్యూరు బాలురు ఆశ్రమ పాఠశాల- 1 స్కూల్ అసిస్టెంట్ అంబటి రాంబాబు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్టు సహాయ గిరిజన సంక్షేమ శాఖాధికారి క్రాంతికుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరు దినేశ్‌కుమార్, డీఈవో బ్రహ్మజీరావు చేతుల మీదుగా ఈ పురస్కారాలు అందుకున్నారు. ఈ సందర్భంగా మండలంలో పలు ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులతోపాటు ఎంఈవో రాంబాబు తదితరులు వీరిని అభినందించారు.

సీలేరు డీఏవీ పాఠశాలలో ..

సీలేరు: సీలేరు డీఏవీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలను వేసి ఘనం గా నివాళులర్పించారు. ఉపాధ్యాయునిగా రాధాకృష్ణన్ సేవలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయుని వేషధారణలో ప్రదర్శించిన కార్యక్రమాలు అలరించాయి. అనంతరం పాఠశాలలోని సీనియర్ హిందీ ఉపాధ్యాయులు రత్నకుమారి, తెలుగు ఉపాధ్యాయుడు పీఎస్ఎన్ మూర్తిని సన్మానించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

జి.మాడుగుల: జిల్లా స్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికైన సందర్భంగా ఎంఈవో-2 వెంకటరమణమూర్తి, బాబూరావులను యూటీఎఫ్ సంఘం మండల అధ్యక్ష, ఉపాధ్యక్షుడు శ్రీను, గంగాధర్ శుక్రవారం ఘనంగా సత్కరించారు. మండలంలో భీరం పాఠశాల ఉపాధ్యాయుడు కె.కళా రావు, డి.కంఠవరం ఉపాధ్యాయుడు యు. ధర్మారావు, డి. రామయ్యలకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ మేరకు కలెక్టర్‌నుంచి అవార్డులు పొందారు.

చింతపల్లి: ఉపాధ్యాయులు సేవలు వెలకట్టలేనివని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యూవీ గిరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పీఆర్‌టీయూ నాయకులు ఉపాధ్యాయులు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ ఉపాధ్యాయుడు సాగిన వీరన్నపడాల్‌ని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగడానికి ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిలర్ కొర్రు మత్స్యలింగం, జిల్లా మహిళా కార్యదర్శి రొబ్బ వెంకట రమణమ్మ, ఏపీసీపీఎస్ఈఏ నేత కుడుముల వెంకటరమణ, ఉపాధ్యాయులు తగ్గి త్రిమూర్తులు, వెంకట రమణ, సత్తిబా బు,గిరిజారాణీ పాల్గొన్నారు.


జి. మాడుగుల ఎంఈవో వెంకటరమణ మూర్తిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

గూడెంకొత్తవీధి: ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలని మండల విద్యాశాఖ అధికారి- 2 కాంగు రామన్న అన్నారు. శుక్రవారం జర్రెల ఆశ్రమ పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు దినోత్సవం నిర్వహించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి, కాంప్లెక్స్ పరిధిలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. పీజీ హెచ్‌ఎం కుమ్మరి సింహాచలం, ఉపాధ్యాయులు గసాది పద్మనాభం, ముర్ల వెంకట రమణ, బూడిద కృష్ణారావు, పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తల జిల్లా నూతన కార్యవర్గం ఎంపిక


జిల్లా అధ్యక్షురాలు రేణుక | జిల్లా కార్యదర్శి పద్మ

పాడేరురూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఆశా కార్యకర్తలు, సామాజిక ఆరోగ్య కార్యకర్తల యూనియన్ జిల్లా నూతన కార్యవర్గంను ఎంపిక చేసినట్టు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌బీ పోతురాజు తెలిపారు. ఆశా కార్యకర్తల జిల్లా 2వ మహాసభలు నేపథ్యంలో 2వ రోజు శుక్రవారం ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు వి.వి. జయ సమక్షంలో ఈ ఎన్నికలను నిర్వహించామన్నారు. జిల్లా యూనియన్ గౌరవాధ్యక్షురాలిగా దాసమ్మ, అధ్యక్షురాలుగా ఎల్.రేణుక (పాడేరు), కార్యదర్శిగా కె.పద్మ (జీకేవీధి), కోశాధికారిగా సరస్వతి (ముంచంగిపుట్టు), ఉపాధ్యక్షులుగా వి.కొండమ్మ (అరకువేలి), సహాయ కార్యదర్శిగా ఎం.మేరి (డుంబ్రిగుడ), కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. సీఐ టీయూ నేత లింగేటి సుందరరావు, పాడేరు డివిజన్ 11 మండలాల ఆశాలు, సీహెచ్‌డబ్ల్యూలు పాల్గొన్నారు.

యువత శ్రమదానం


పీహెచ్‌సీ పరిసరాల్లో జంగిల్ తొలగిస్తున్న మిషన్ తాజంగి సొసైటీ యువత

చింతపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాజంగి పీహెచ్‌సీ పరిసరాలను స్థానిక యువత శుభ్రం చేశారు. ఈ గ్రామపంచాయతీకి చెందిన యువత పర్యాటకం ద్వారా ఉపాధి పొందుతున్నారు. ఈ నేపథ్యంలో గామ అభివృద్ధికి స్థానిక యువత మిషన్ తాజంగి సొసైటీని ఏర్పాటు చేశారు. వచ్చిన ఆదాయంలో 30శాతం గ్రామ అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు కేటాయిస్తున్నారు. ఈస్థితిలో తాజంగి పీహెచ్‌సీ చుట్టూ పెరిగిన జంగిల్‌ని తొలగించి శుభ్రం చేశారు. మిషన్ తాజంగి సొసైటీ అధ్యక్షుడు శెట్టి శంకరరావు పాల్గొన్నారు.

'టీడీపీ నేత సత్యనారాయణ సేవలు మరువలేనివి'

కొయ్యూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : టీడీపీ బలోపేతానికి ఆ పార్టీ నేత అనిశెట్టి సత్యనారాయణ చేసిన సేవలు అమోఘమైనవని జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్ అన్నారు. దివంగత సత్యనారాయణ ఐదో వర్ధంతిని కుటుంబీకులు చిరంజీవి, వీరబాబు, నాగేశ్వరావుల ఆధ్వర్యంలో శుక్రవారం చింతవానిపాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబీకులు సమకూర్చిన చీరలను సుమారు 100 మంది పేదలకు పంపిణీ చేశారు.కొయ్యూరు సర్పంచ్ బాలరాజు, నేతలు మేడిబోయిన చిన్న ఎం. బూర్గులయ్య,బాలరాజు,యూత్, మహిళలున్నారు.

సచివాలయం ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలి

- సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ కుమార్



ముంచంగిపుట్టు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సచివాలయం ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలని ఆదివాసీ సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుజారి సురేష్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతంలో పని చేస్తున్న వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్స్, మహిళా పోలీసులకు, మిగిలిన సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులకు కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇతర అన్ని శాఖలకు ప్రమోషన్ చానెల్స్ ఉన్నాయని, ఈ రెండు శాఖలకు సరైన విధానాలు ప్రభుత్వంనుంచి ఇంకా విడుదల కాలేదన్నారు. దీంతో పదోన్నతులకు దూరమౌతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలు పంచాయతీ స్థాయిలో విజయవంతం కావడానికి ఈ శాఖలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. అయినా, ఉద్యోగంలో చేరి సుమారు ఐదేళ్లయినా, వారికి ఎటువంటి ప్రమోషన్లు లేవని వాపోయారు. కూటమి ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు పూజారి సత్యవతి, బాలరాజు, మత్స్యరాజ్ దొర, సింహాచలం, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత చింతనతో ప్రశాంత జీవనం


మాట్లాడుతున్న అర్చక సంఘ ప్రతినిధులు

కొయ్యూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికత చింతనతో ప్రశాంత జీవనం చేకూరుతుందని అర్చక సంఘ ప్రతినిధులు సూచించారు. శుక్రవారం రావణాపల్లి పంచాయతీ తోటలూరు రామాలయంలో జిల్లా అర్చక సంఘ ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామాలయంలో భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశమై ఆధ్యాత్మిక విలువలను భక్తి ప్రవచనాల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి రమణ ఆధ్వర్యంలో గ్రామపెద్దలు కాకురు చంద్రరావు, పి. చంద్రరావు, గ్రామస్థుల సహకారంతో అర్చకులకు అల్పాహార విందును సమకూర్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా గల పలు ఆలయాలకు చెందిన అర్చకులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చన


సీలేరులో వినాయక మండపం వద్ద కుంకుమ పూజలను నిర్వహిస్తున్న దృశ్యం

సీలేరు, సెప్టెంబరు 5 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు లో వర్తక సంఘం కార్యాలయం వద్ద గణపతి నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా శుక్రవారం వినాయకుని సన్నిధిలో సామూహిక కుంకుమార్చన పూ జా కార్యక్రమాలు నిర్వహించారు. దామోదర స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో స్థానిక మహిళలు పాల్గొన్నారు. అలాగే కన్నబ్బాయి క్యాంప్, దుర్గావీధిల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాలు చేపట్టారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన

- జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర


దారెలలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గిరి గ్రామాల్లో దశలవారీగా మౌలిక సదుపాయలను కల్పించనున్నట్టు విశాఖ ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని దారెల పంచాయతీ కేంద్రంలో జడ్పీ నిధులతో చేపటనున్న డ్రైనేజీ నిర్మాణం పనులకు జడ్పీ చైర్‌పర్సన్, సర్పంచ్ పి.పాండురంగస్వామిలు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ముందుగా ఆమె గ్రామంలో ఏర్పాటు చేసిన గురుపూజోత్సవంలో పాల్గొన్నారు. డాక్టర్‌సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ సర్పంచ్ పాండురంగస్వామి వినతి మేరకు డ్రైనేజీ నిర్మాణానికి జడ్పీ నిధులు రూ.10 లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారు. ఆ నిధులతో 200 మీటర్ల డ్రైనేజీ నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. మండలంలో మారుమూల గ్రామాల్లో సైతం మౌలిక సదుపాయాలు కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మధు, వైసీపీ మండల అధ్యక్షు డు పి.పద్మారావు, నేతలు జేవీవీఎన్ మూర్తి, జగబంధు పాల్గొన్నారు.

హెక్టగుడ వంతెన నిర్మాణానికి వినతి


గంగులయ్యకు వినతిపత్రాన్ని అందిస్తున్న జనసేన, టీడీపీ నాయకులు

అనంతగిరి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువ శోభ పంచాయతీ హెక్టగుడ గ్రామాన్ని శుక్రవారం టీడీపీ అరకు పార్లమెంట్ నియోజవర్గ ఇన్‌చార్జి, జానపద కళలు, సృజనాత్మకత అకాడమీ చైర్మన్ వంపూరు గంగులయ్య పర్యటిం చారు. తొలుత ఆయనకు జనసేన, టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఎగువశోభ గ్రామ సమీపంలోని గెడ్డపై కాలిబాట వంతెన హుద్‌హుద్ తుపాన్‌కు కొట్టుకుపోయిందని, దీంతో హెక్టగుడ, దండబాబు గ్రామాల గిరిజనులకు రాకపోకలు అంతరాయం ఏర్పడుతున్నట్టు స్థానికులు గంగులయ్యకు వివరించారు. జనసేన మండల పార్టీ అధ్యక్షుడు చిట్టం మురళి, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మట్టం శ్యామ్ ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. వంతెన నిర్మాణానికి ప్రభుత్వం దృష్టికి తీసుకునివెళ్తామని ఆయన గిరిజనులకు హామీ ఇచ్చారు. జనసేన సైనికులు చిన్న, మధు, లక్ష్మణ్, ఉదయ్, రామన్న, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రహిత జిల్లాకు సహకరించాలి: ఈగల్ ఇన్‌స్పెక్టర్


ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అవగాహన కల్పిస్తున్న ఇన్ స్పెక్టర్ శివశంకర్ నాయక్, యువకులు

పాడేరురూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, యువత కృషి చేయాలని ఈగల్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ నాయక్ కోరారు. పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శుక్రవారం ఆయన ఇంటర్నేషనల్ కోఫోకాన్ కరాటే క్లబ్ చీఫ్ బాకూరు పాండురాజు, కరాటే శిక్షణ విద్యార్థులతో కలిసి ప్రయాణీకులకు మాదక ద్రవ్యాలు, మత్తుపదార్థాలు వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాండురాజు మాట్లాడుతూ గంజాయి, మాదక ద్రవ్యాలకు యువత అలవాటు పడితే వారి జీవితంతోపాటు కుటుంబాలు సర్వనాశనం అవుతాయన్నారు. ఎవరైనా గంజాయి సాగు చేసిన, రవాణా చేసినా కఠిన శిక్షలు విధిస్తారన్నారు. యువతను మంచి మార్గంలో నడిపించేందుకు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బాధ్యతలు చేపట్టాలని కోరారు.

రహదారి మంజూరుపై హర్షం


గ్రామస్థులకు రహదారి మంజూరు పత్రాలు అందజేస్తున్న పెసా కమిటీ నేతలు

జి.మాడుగుల, సెప్టెంబరు 5 (ఆం ధ్రజ్యోతి): మండలంలోని సొలభం పంచాయతీ మల్లిపాడు గ్రామ రహదారికి నిధు లు మంజూరుపై పెసా కమిటీ నాయకు లు, స్థానికులు హర్షం ప్రకటించారు. ఈ సందర్భంగా పెసా కమిటీ మండల ఫోరం అధ్యక్షుడు లకే రామకృష్ణ మాట్లాడుతూ, కలెక్టర్‌కి గ్రీవెన్స్‌లో గ్రామస్థులు ఎదుర్కొంటున్న రవాణా సమస్యపై వినతి పత్రం అందించామన్నారు. ఈ మేరకు మల్లిపాడుకు గ్రావెల్ రోడ్డు మంజూరు చేశారన్నా రు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎల్.బాలయ్యాదొర, పెసా కమిటీ నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలపై పాట సీడీ ఆవిష్కరణ


గీతం సీడీ నమూనాను ఆవిష్కరిస్తున్న రచయిత నన్షయ్య, ప్రిన్సిపాల్ విజయభారతి

చింతపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలపై రూపొందించిన గీతాన్ని రచయిత, కడప యనమాల ఎంపీ స్కూల్ ఉపాధ్యాయుడు ఎన్. కృష్ణయ్య ఆవిష్కరించారు. శుక్రవారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి అధ్యక్షతన గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యాజమాన్యం, అధ్యాపకులు రూపొందించిన కళాశాల గీతం సీడీని రచయిత ఆవిష్కరించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అల్లూరి నడయాడిన చింతపల్లిలో 2008లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విశిష్టతను వర్ణిస్తూ, ఆదివాసీ విద్యార్థుల ఆచార, వ్యవహారాలు ప్రతిబింబించేలా ఈ గీతాన్ని రూపొందించామన్నారు. ఈగీతాన్ని ఉపాధ్యాయుడు కృష్ణయ్య రచించగా చీఫ్ కోఆర్డినేటర్ కేవీ మురళీ కృష్ణ సహకారంతో హైదరాబాదీకి చెందిన ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ వీవీ నాయక్ స్వపరిచారన్నారు. కడారి నాగరాజు గానం చేశారన్నారు. ఈగీతం యూట్యూబ్, సీడీల రూపంలో అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

మహిళలకు స్వయం ఉపాధి యూనిట్లు: ఏపీఎం


చింతపల్లిలో చిరుధాన్యాల ఫాస్టుఫుడ్ స్టాల్‌ని ప్రారంభిస్తున్న టీడీపీ నేత ఆనందరావు

చింతపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక ప్రగతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వయం ఉపాధి యూనిట్స్ మంజూరు చేస్తున్నట్టు వెలుగు ఏపీఎం బి. శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో నేషనల్ ఎగ్ కార్పొరేషన్ కమిటీ మంజూరు చేసిన ఫాస్ట్‌ఫుడ్ స్టాల్ (గిరిజన చిరుధాన్యాల వంటకాలు)ని టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రీమల ఆనందరావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధిలో రాణించేందుకు ప్రభుత్వం రూ.50 వేల విలువైన ఫాస్ట్‌ఫుడ్ స్టాల్ సామగ్రిని మంజూరు చేశారన్నారు. తొలివిడతగా మండల కేంద్రం సాయినగర్ భరతమాత డ్వాక్రా గ్రూప్‌నకుచెందిన పాంగి లక్ష్మి, సాయినగర్ దీపిక తేజ్వని డ్వాక్రా గ్రూప్‌నకు చెందిన కదుళ్ల నాగమణిలకు ఈ యూనిట్స్ మంజూరయ్యాయన్నారు. పాంగి లక్ష్మి హనుమాన్ జంక్షన్ జాతీయ రహదారి వద్ద ఏర్పాటుచేసిన ఫాస్ట్‌ఫుడ్ స్టాల్‌లో చిరుధాన్యాలతో తయారుచేసిన ఇడ్లీ, బిర్యానీ, ఎగ్‌రైస్, దోస, చపాతిలు విక్రయిస్తారన్నారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు లక్కోజు నాగభూషణం, దూరి రామకృష్ణ, వల్లి, మండల సమాఖ్య అధ్యక్షులు కె. సన్యాసమ్మ పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు: ఏవో


ఏవో పర్యవేక్షణలో యూరియాను రైతులకు విక్రయిస్తున్న డీలర్లు

చింతపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో విక్రయిస్తున్న యూరియా సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి టి. మధుసూదనరావు రైతులకు సూచించారు. శుక్రవారం మండలానికి ప్రభుత్వం పంపించిన 10.8టన్నుల యూరియాను ప్రైవేటు డీలర్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మండలంలో యూరియా కొరతలేదన్నారు. ఇప్పటికే ప్రైవేటు డీలర్లకు తొలివిడతగా యూరియా అందజేశామన్నారు. శనివారం మరో 20 టన్నులు రానున్నందని, ఈయూరియాను ప్రైవేటు డీలర్లకు అందజేస్తామన్నారు. చౌడపల్లి రైతు సేవా కేంద్రంలో ఆరు టన్నుల యూరియా విక్రయానికి సిద్ధంగా ఉందన్నారు. మండలంలోనున్న ఆరు రైతు సేవా కేంద్రాలకు మరో 30 టన్నుల యూరియా సరఫరా కానుందన్నారు.. ప్రభుత్వ రాయితీ మినహాయించగా 45 కిలోల యూరియా రూ.270కు విక్రయిస్తున్నట్టు చెప్పారు. యూరియాను డీలర్లు అక్రమంగా నిలువచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు


పాడేరులో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు


పాడేరు రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రేమ, సహనం, శాంతి, సామరస్యాలను బోధించిన మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా జిక్రే ఆలాహీ మసీద్ గురువు మొహ్మద్ అలీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జూలుస్ (ర్యాలీ)నిర్వహించారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మస్జీద్ గురువు మాట్లాడుతూ విగ్రహం, చిత్రపటం లేకపోయినా ప్రపంచ వ్యాప్తంగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి ప్రవక్త మహమ్మద్ అన్నా రు. ఏటా మిలాద్ ఉన్ నబీ రోజున ముస్లిం సోదరులు అంతా ఏకమై మసీద్‌లో జమాత్ అందరూ ప్రత్యేక ప్రార్థనలు చేపట్టి పట్టణంలో భారీ ర్యాలీని చేపడతామన్నారు. ఈ ర్యాలీని మసీద్ నుంచి పట్టణంలోని మెయిన్ రోడ్డు మీదుగా అంబేద్కర్ కూడలి, సినిమాహాలు సెం టర్ మీదుగా పీటీడీ కాంప్లెక్స్ వరకు భారీగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు షేక్ అబ్దుల్లా, మహమ్మద్ ఇక్బాల్, మహమ్మద్ సులేమాన్, షేక్ అన్సారీ, ఇమామ్ ఎండీ ఆలీ, ఇక్బాల్, మస్తాన్, షమీమ్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

సంపంగిదాటుకి రోడ్డు, పాఠశాల సౌకర్యాలు కల్పించండి


అధికారులను వేడుకుంటున్న గ్రామస్థులు

పెదబయలు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంతుర్ల పంచాయతీ పరిధి మారుమూల సంపంగిదాటు పీవీటీజీ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ, శుక్రవారం గిరిజన సంఘం నాయకులు బాబూజీ ఆధ్వర్యంలో గ్రామస్థులు నిరసన తెలిపారు. గ్రామంలో 30 కుటుంబాలు నివసిస్తున్నాయి. 25 మంది చిన్నారులు చదువుతున్నారు. పాఠశాల భవనం, అంగన్‌వాడీ భవనం లేక మూడు కిలోమీటర్ల దూరంలోని పక్క గ్రామానికి వాగుదాటి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటోందని బాబూజీ తెలిపారు. నిత్యావసర సరుకులు, రేషన్, అత్యవసర ప్రయాణం, ప్రభుత్వం అందించే సంక్షమ పథకాల కోసం పంచాయతీ కేంద్రానికి వెళ్లాలన్నా గ్రామస్థులకు అవస్థలు తప్పడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు.ఈవిషయపై అధికారులు దృష్టికి పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. పీఎం జన్‌మన్ గృహాలు మంజూరుకాగా, గ్రామానికి రహదారి లేక నిర్మాణాలు ముందుకు సాగడంలేదని గ్రామస్థులు ఆవేదన వక్తం చేశారు.

వైభవంగా వినాయక నిమజ్జనం


ముంచంగిపుట్టులో నిమజ్జనానికి తీసుకువెళ్తున్న విగ్రహం

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్‌లో అల్లూరి యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ వినాయక నిమజ్జన ఊరేగింపు కార్యక్రమం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర హాజరయ్యారు. విగ్నేశ్వరుడిని జడ్పీ చైర్ పర్సన్ దంపతులు సుభద్ర, మూర్తిలు దర్శించుకున్నారు. అనంతరం యూత్ కమిటీ ప్రతినిధులు ప్రతిమను భారీ ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకువెళ్లారు. డప్పు వాయిద్యాలు, థింసా నృ త్యాలు, బాణసంచా మధ్య మత్స్యగెడ్డ వరకు ఊరేగింపు సాగింది.


ఊరేగింపులో థింసా నృత్యం చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ఈసందర్భంగా జడ్పీ చైర్ పర్సన్ సుభద్ర మహిళలతో కలసి థింసా నృత్యం చేశారు. మండలంలో గల ఏనుగురాయి పంచాయతీ జంగంసరియా గ్రామంలో ఏర్పాటుచేసిన వి గ్రహాన్ని మత్స్యగెడ్డలో నిమజ్జనం చేశారు.

అరగడాపల్లికు రహదారి మంజూరు చేయాలి


టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరికి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంచుల పంచాయతీ అరగడాపల్లి గ్రామానికి తారు రోడ్డు నిర్మించాలని పాడేరు టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరిని కోరినట్టు స్థానిక పార్టీ మండలాధ్యక్షుడు పొత్తూరు కొండలరావు తెలిపారు. శుక్రవారం పాడేరులో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో గిరిజనులతో కలిసి ఈ మేరకు వినతి పత్రమిచ్చారు. ఈసందర్భంగా కొండలరావు మాట్లాడుతూ అరగడాపల్లికు రహదారి మంజూరు చేసి స్థానికుల కష్టాలు తీర్చాలని కోరారు. పీఎంజీఎస్‌వై ద్వారా తారు రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తామని ఈశ్వరి హామీ ఇచ్చారన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేత పసుపులేటి నాగమణి, వైస్‌ఎంపీపీ సప్పగెడ్డ ఆనందరావు, జనసేన నాయకులు కూడ మధుకుమార్ పాల్గొన్నారు.



నర్సీపట్నంలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

జిల్లాలోని నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల పరిధిలోని అన్ని మండలాల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పలువురు ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు అందజేశారు.

నర్సీపట్నం/నర్సీపట్నం అర్బన్/మాకవరపాలెం/నాతవరం/గొలుగొండ/కృష్ణాదేవిపేట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో దస్త్రాల రాఘవేంద్రరావు చేతుల మీదుగా సుదీర్ఘ కాలం సేవలు అందించి పదవీ విరమణ చేసిన బాబీ మాస్టారు, డి.నూకరాజు, పల్లా దొరబాబు, పిట్ట రామకృష్ణ, కేవీరమణ, ఏవీఎస్ఎన్ మూర్తిలకు శాలువ కప్పి జ్ఞాపికతో సత్కరించారు. క్లబ్‌లో సభ్యులుగా ఉన్న ఉపాధ్యాయులకు పండ్లు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వరహాలనాయుడు, ప్రధానోపాధ్యాయుల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎస్ ప్రసాద్, పీఆర్టీయూ అధ్యక్షుడు వరహాలనాయుడు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కర్రిరాంగోపాల్, ఎంవీరంగారావు, కుప్పిలి స్వామి, అల్లు అప్పారావు పాల్గొన్నారు. నవ్యలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వెంకునాయుడు పేటలో గురుపూజోత్సవం నిర్వహించి మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్ఎం ఏవీ ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు రమేశ్, సీహెచ్‌వీ ప్రసాద్, ఎ.బుల్లబ్బాయి, ఎస్.నాగేశ్వరరావు, సీహెచ్.లోవనారాయణమ్మలను సన్మానించారు.కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు కర్రి రాంగోపాల్, కార్యదర్శి బేతిరెడ్డి విజయ్, ట్రెజరర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీవిద్య కళాశాలలో ఇంటర్ విద్యార్థులు గురుపూజోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉపాధ్యాయులను ఆటలాడించి బహుమతులు అందజేశారు. సీనియర్ అధ్యాపకులు శేషగిరికి సన్మానించారు. వేములపూడి జడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తున్న పీడీ రవి జిల్లా ఉత్తమ పీడీగా అవార్డు మంత్రి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్ చేతుల మీదుగా అందజేశారు. మాకవరపాలెం అవంతి కాలేజీలో గురుపూజోత్సవను ఘనంగా నిర్వహించారు. కాలేజీ చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. అనంతరం ప్రిన్సిపాల్ మోహన్‌రావును సన్మాంచారు. నాతరవంలో ఉత్తమ ఉపాధ్యాయులు టి.లోవకుమారి, భారతి, సుజాత, ఎల్‌వీ రమణమూర్తి, చంటిబాబులను తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, అధికారులు సత్కరించారు. సమాజాన్ని తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని ఈ సందర్భంగా చైర్మన్ కోరారు. కార్యక్రమంలో ఎంఈవోలు బ్రహ్మజీ, కామిరెడ్డి వరహలబాబు, జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి వీరసూర్యచంద్ర రాష్ట్ర నాయకులు పైల పోతురాజు, ఎస్.విజయ్‌కుమార్, కొంద్రు మరిడియ్య, అప్పల నర్స, జి.రాణి, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు. గొలుగొండలోని జోగంపేట హైస్కూల్లో పనిచేస్తున్న ప్రత్యేక అవసరాలు ఉపాధ్యాయుడు తమ్మిల మాణిక్యంకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును మంత్రి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్ అందజేశారు. అలాగే ఏఎల్ పురంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన తొమ్మిది మందిని సీఐ రేవతమ్మ, ఎస్ఐ తారకేశ్వరరావు సత్కరించారు.

చోడవరం నియోజకవర్గంలో...



అనకాపల్లిలోఉపాధ్యాయుడు గంగాధర్‌ను సత్కరిస్తున్న మంత్రి అనిత

చోడవరం/రావికమతం/రోలుగుంట/బుచ్చెయ్యపేట: చోడవరం మండలంలోని గౌరీపట్నం హైస్కూల్ సోషల్ అసిస్టెంట్ పీవీజీ ఎస్.గంగాధర్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. శుక్రవారం హోమంత్రి గంగాధర్‌ను సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా గంగాధర్‌కు అవార్డు రావడం పట్ల మండలంలోని ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. రావికమతంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన కొత్తకోట హైస్కూల్ హెచ్ఎం రెడ్డి వెంకట సత్యనారాయణను శుక్రవారం హోం మంత్రి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, డీఈవో అప్పారావు నాయుడు సన్మానించారు. బుచ్చెయ్యపేట మండలంలోని వడ్డాది ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం నిమ్మల రమకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును మంత్రి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్ అందజేశారు. రోలుగుంట మండలంలోని వెలంకాయలపాలెం పాఠశాల ఉపాధ్యాయులు బి.చంద్రశేఖర్‌కు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును మంత్రి అనిత, కలెక్టర్ విజయ్‌కృష్ణన్ అందజేశారు. ఎంఈవో జాన్‌ప్రసాద్, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, పాఠశాల యాజమాన్యం తదితరులు ఆయన్ను అభినందించారు.

మాడుగుల నియోజకవర్గంలో....



మాడుగులలో రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

మాడుగుల/కె.కోటపాడు/దేవరాపల్లి/చీడికాడ: మాడుగుల కేంద్రంలో జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి రొబ్బా మహేశ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద సర్పంచ్ యడ్ల కళావతి జ్యోతి ప్రజ్వలన చేశారు. మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, ఉప సర్పంచ్ జవ్వాది వరహాలరావు, నాయకులు పుట్టా గంగయ్య, వడ్డాది వరలక్ష్మి, భీమరశెట్టి పైడియ్యనాయుడు, ఉద్యోగులు పాల్గొన్నారు.

దేవరాపల్లి మండలంలోని కాశీపురంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అంతకు ముందు రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయురాలు ఆర్.సుజాతను శాలువా కప్పి సత్కరించారు. స్థానిక నేత కొటాన రాంబాబు తదితరులు పాల్గొన్నారు. కె.కోటపాడు అయ్యన్న విద్యా సంస్థలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి, చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాల వేశారు. అనంతరం అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాశీంను, ఉపాధ్యాయులను, అధ్యాపకులను ఘనంగా సన్మానం చేసి బహుమతులను ప్రదానం చేశారు. విద్యాసంస్థల తరపున ప్రముఖ వ్యక్తిత్వ వికాస్ నిపుణులు డాక్టర్ బి.పోతన, పరిపాలన అధికారి దాట్ల చంద్రశేఖరవర్మ తదితరులను ఘనంగా సత్కరించారు. అలాగే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా మండల మురళీకృష్ణ మంత్రి అనిత చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. చీడికాడ మండలంలోని వరహాపురం హైస్కూల్‌లో హెచ్ఎం డి.వరహామూర్తి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యారు. ఈ మేరకు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అనకాపల్లిలో రాష్ట్ర హోంమంత్రి అనిత, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తదితరుల చేతులమీదుగా అవార్డు తీసుకున్నారు. ఆయన్ను గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి చిన్నమ్మలు, వైస్ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి, ఉపాధ్యాయులు అభినందించారు.

తెలుగోడి కీర్తి చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్

» భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



ఎన్టీఆర్ విగ్రహాన్ని అవిష్కరిస్తున్న భీమిలి, చోడవరం ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, కేఎస్ఎన్ఎస్ రాజు, చిత్రంలో బత్తుల తాతయ్యబాబు, గునూరు మల్లునాయుడు

రావికమతం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెగుగోడి కీర్తిని ప్రపంచ దేశాలకుచాటి చెప్పిన మహనీయుడు తెలుగు దేశవ పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని జడ్.బెన్నవరం పంచాయతీ శివారు కిత్తంపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎన్టీఆర్ విగ్రహాన్ని శుక్రవారం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజమే దేవాలయంగా తెలుగుదేశం పార్టీని స్థాపించి, కేవలం తొమ్మిది నెలల వ్యవధిలోనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోదించిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కిందన్నారు. పేదోడికి కూడు, గూడు, గుడ్డకు లోటు ఉండకూదన్నదే ఆ మహనీయుడి ఆశయమన్నారు. ఆయన సిద్ధాంతాలతోనే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని పేర్కొన్నారు. అందుకే పేదరికం లేని సమాజంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో పీ4 విధానం ఆమలు చేస్తున్నారన్నారు. ప్రజా హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న మహోన్నత నాయకుడు ఎన్టీఆరే అని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు కొనియాడారు. అంతటి మహనీయుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసిన కిత్తంపేట గ్రామ ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు. స్వర్గీయ ఎన్టీఆర్ స్థాపించిన గొడుగులో అందరం ఉండడం ఎంతో అదృష్టమని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు పేర్కొన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు కోమటి శంకరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు గునూరు మల్లునాయుడు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి, కూటమి నాయకులు పినపోలు వెంకటేశ్వర్లు, కోట గోవిందరావు, రాజాన కొండ నాయుడు, గుటాల చిన్న, కర్రి అర్జున, పెదిరెడ్ల నాగేశ్వరావు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల ప్రైవేటు పరం కాకుండా చూడాలి

» మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేశ్

నర్సీపట్నం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం కాకుండా చూడాలని మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో నర్సీపట్నం నియోజవర్గానికి మంజూరైన మెడికల్ కళాశాలకు అనుమతులు లేవని ఎన్నికలకు ముందు అయ్యన్నపాత్రుడు తప్పుడు ప్రచారం చేశారని విమర్శించారు. మాకవరపాలెంలోని వైద్య కళాశాల నిర్మాణాలు ఎన్‌సీసీ చేపట్టిందని, అనుమతులు లేకుండా అంత పెద్ద సంస్థ ముందుకు వస్తుందా అని ప్రశ్నించారు. తాజాగా కూటమి ప్రభుత్వం ప్రైవేటు, పబ్లిక్ పార్టనర్షిప్ విధానంలో చేపట్టాలని నిర్ణయం తీసుకుందని తెలిపారు. నర్సీపట్నం మెడికల్ కళాశాల ప్రైవేటు పరంగా కాకుండా అయ్యన్న పాత్రుడు కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గం

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వీఆర్ పేట తులసీ కల్యాణ మండపంలో శుక్రవారం ఈ ఎన్నిక జరిగింది. నూతన అధ్యక్షుడిగా బి.శేషుకుమార్, ప్రధాన కార్యదర్శిగా సిహెచ్.మధుకృష్ణతో పాటు మరి కొంత మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పూర్వపు కార్యదర్శి బి.వెంకటపతిరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాల వ్యవస్థను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు తమరాన త్రినాథ్, ధర్మారావు, ఎస్.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఎన్నికల అధికారులు మహలక్ష్మినాయుడు, బి.దేముడుబాబు వ్యవహరించారు.

శివాలయ వ్యవస్థాపకులు ఆంజనేయస్వామి విగ్రహావిష్కరణ

రావికమతం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శివాలయం వ్యవస్థాపకులు, ఆలయ ప్రధాన అర్చకులు రాచకొండ అంజనేయస్వామి విగ్రహావిష్కరణ కార్యక్రమం భక్తులు, గ్రామస్థులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడ శివ పంచాయతన ఆలయాలను ఒకేచోట దాతల సహకారం, తన ఆస్తులతో అంజనేయస్వామి ఏర్పాటు చేశారు. తద్వారా ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏటా నిర్వహించి ప్రజల్లో భక్తిభావం నెలకొల్పారు. ఆయన సేవలకు గుర్తింపుగా ఆలయ ఆవరణలో ఓ భాగంలో విగ్రహ అవిష్కరణ చేశారు. అంతకు ముందు గ్రామస్థులు స్థానికకాంనుంచి ఆంజనేయస్వామి విగ్రహం ఊరేగింపుగా తీసుకొచ్చి శివాలయం వద్ద అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముక్కా మహాలక్ష్మినాయుడు, రావికమతం ఉప సర్పంచ్ గంజి మోదునాయుడు, టీడీపీ నాయకులు వేపాడ నాగేశ్వరావు,జనసేన నాయకులు గంజి శ్రీను, సూరిబాబు పాల్గొన్నారు.

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎరుకులమ్మ బదిలీ



ఎరుకులమ్మ

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణాదేవిపేట అటవీ రేంజ్ పరిధిలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా పనిచేసిన పి.ఎరుకులమ్మ పదోన్నతిపై చింతపల్లి మండలం తాజంగి అటవీ సెక్షన్ అధికారిగా బదిలీ అయ్యారు. ఆమె మూడేళ్లగా కృష్ణాదేవిపేటలో పనిచేస్తూ అటవీ సంపద పరిరక్షణ, కలప అక్రమ రవాణా నిర్మూలనకు కృషి చేశారు. ఆమె బదిలీ కావడంతో ప్రస్తుతం రేంజ్ పరిధిలో ఇప్పటికే సెక్షన్ అధికారి, గార్డులు, వాచర్ పోస్టులు ఖాళీ కావడంతో కలప అక్రమ రవాణా నిర్మూలనపై నిఘా లేకపోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పోస్టులు భర్తీ చేయాలని, లేనిపక్షంలో స్పందించి ఖాళీగా ఉన్న పోస్టుల్లో మరో ప్రాంతం నుంచి డిప్యూటేషన్‌పై లేదా ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షంలో అటవీ సంపద కనుమరుగయ్యే ప్రమాదం లేకపోలేదని వారు వాపోయారు.

చంద్రబాబుపై అనుచిత పోస్టులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నాతవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, మంత్రులపై అనుచిత పోస్టులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పార్టీ నాతవరం నాయకులు కొంద్రు మరిడియ్య. అపిరెడ్డి మాణిక్యం తదితరులు శుక్రవారం పోలీసులకు ఇచ్చిన పిర్యాదులో కోరారు. చంద్రబాబునాయుడు నేర చరిత్రలో నంబరు వన్ అని తప్పుడు ప్రసారం చేయించారన్నారు. చంద్రబాబు మర్యాదను కాపాడి తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఇటంశెట్టి సీతారామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళ కుటుంబానికి పరామర్శ

మాడుగుల రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తాచేరు గెడ్డపై గిరిజనులు నిర్మించుకున్న కర్రల కాలిబాట దాటుతుండగా గెడ్డలో పడి మృతి చెందిన గిరిజన మహిళ పాంగి మచ్చమ్మ కుటుంబాన్ని ఐదో షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరట నరసింహమూర్తి శుక్రవారం పరామర్శించారు. గిరిజన మహిళ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన ప్రదేశంలో మృతదేహాన్ని తీసుకు వస్తూ నిరసన తెలిపారు. శంకరం పంచాయతీలో కొత్తవలస, వెలగలపాడు, గొప్పూరు, తాడివలస, రాయిపాలెం, రాజంపేట, మామిడిపాలెం గ్రామాలకు గతంలో రూ.9.2 లక్షలతో రోడ్లు నిర్మాణం చేపట్టి అసంపూర్తిగా వదిలేశారన్నారు. తాడివలస, కొత్తవలస గ్రామాల మధ్య గెడ్డపై వంతెనలు లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారన్నారు. గెడ్డలు దాటి రాలేక గిరిజనులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి గిరిజన గ్రామాలకు వంతెనలు, రోడ్లు నిర్మించాలని ఆయన కోరారు.

ఏరియా ఆస్పత్రికి కొత్త 108 అంబులెన్స్



కొత్త 108 అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ సుధాశారద

నర్సీపట్నం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏరియా ఆస్పత్రికి కొత్త 108 అంబులెన్స్ మంజూరైంది. మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుధాశారద శుక్రవారం ఈ వాహనాన్ని ప్రారంభించారు. గతంలో ఏరియా ఆస్పత్రికి మంజూరైన 108 అంబులెన్స్‌లలో రూ.7 లక్షల కిలోమీటర్లకుపైగా తిరిగిన వాహనం స్థానంలో ప్రభుత్వం కొత్తది మంజూరు చేసింది. అడ్వాన్స్ లైఫ్ సపోర్టెడ్ అంబులెన్స్‌లో అత్యాధునిక వైద్య పరికరాలు, సదుపాయాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ శ్రీనివాసచారి, ఆపరేషన్ ఎగ్జిక్యూటీవ్ జగన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిటీష్ సమాధుల స్థలంలో దుకాణాలు తొలగించాలి

» సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు డిమాండ్



మాట్లాడుతున్న కోటేశ్వరావు, పక్కన రాజు

నర్సీపట్నం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ సైనిక అధికారులు సమాధులు ఉన్న ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించిన దుకాణాలు తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ హైకోర్టు స్టేటస్కో ఆదేశాలు ధిక్కరించి దుకాణాలు నిర్మిస్తే అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. హైకోర్టు స్టేటస్కో ఆదేశాలను ధిక్కరిస్తూ ఆక్రమణ దారులను అధికారులు ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. తక్షణమే అక్రమ నిర్మాణాలు తొలగించకపోతే కోర్టు దిక్కారణ కేసులు వేస్తామని ఆయన హెచ్చరించారు. అల్లూరి సాయుధ పోరాట స్ఫూర్తికి చిహ్నంగా ఉన్న ప్రభుత్వ స్థలం ఆక్రమణలు జరుగుతుంటే పట్టించుకోకపోవడం దారణమన్నారు. పార్టీ నేత అడిగర్ల రాజు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్-ఉన్-నబీ జయంతి



గ్రామంలో ఊరేగింపుగా వెళ్తున్న ముస్లిం సోదరులు

మాడుగుల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం మహ్మద్ ప్రవక్త జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు సోదరులు జామియా మసీదులో వేకువజాము నుంచి ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లింల సోదరులు ఆచార పద్ధతిలో జెండాలతో గ్రామ పురవీధుల మీదుగా గ్రామ పురవీధుల మీదుగా తిరిగారు. ఈ ఉత్సవం సందర్భంగా హిందూ ముస్లిం సోదరులు బాయ్ బాయ్ అనే నినాదంలో ర్యాలీ సాగించారు. గ్రామంలో ప్రజలకు షాదీ ఖానలో విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు హాజరై వారు అందించిన విందును స్వీకరించారు. ఈ కార్యమంలో జామియా మసీద్ అధ్యక్షుడు షేక్ మస్తాన్, మసీద్ గురువు హుస్సేన్, మత పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కేజే పురం రహదారి



తుప్పలు, గతుకులతో అధ్వానంగా తయారైన కేజే పురం రహదారి

మాడుగుల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మాడుగుల నుంచి ఘాట్ రోడ్డు మార్గంలో కేజే పురం గ్రామం వద్ద గోతులతో ప్రమాదాలు చోటుచేసుకునే పరిస్థితి నెలకొంది. గతంలో ఇక్కడి మలుపు వద్ద బైకులు ఢీకొన్న ఘటనలు ఉన్నాయి. మాడుగుల నుంచి ఘాట్ రోడ్డు వెళ్లే మార్గంలో తాచేరు సమీపంలో ఎడమ చేతివైపుగా కేజే పురం గ్రామానికి రోడ్డు ఉంది. కుడి వైపు నుంచి విద్యుత్ సబ్ స్టేషన్‌తో పాటు అటుగా మాడుగుల గ్రామాలకు చెందిన రైతులు కళ్లాలు ఉన్నాయి. అలాగే నిత్యం ఈ నాలుగు రోడ్లలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ కూడలిలో వాహనాలు అతి వేగంగా వస్తుంటాయి. ఈ నేపథ్యంలో కేజే పురం, సబ్‌స్టేషన్‌కి, వ్యవసాయ పొలాలకు వాహనాలు రాకపోకలు సాగించేవారు మలుపు వద్ద తుప్పలు వల్ల ప్రమాదాలు చోటుచేసుకునే పరిస్థితి ఉంది. అధికారులు చర్యలు తీసుకొని ప్రమాదాలు జరుగుకుండా స్పీడ్ బేకర్లు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆటో డ్రైవర్ అదృశ్యంపై కేసు నమోదు

లంకెలపాలెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్ అదృశ్యంపై పరవాడ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాలివి. జీవీఎంసీ 84వ వార్డు పరిధి సాలాపునివానిపాలెం గ్రామానికి చెందిన గెంజి రాజు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల మూడో తేదీన రాజు తన ఆటోను ఇంటి వద్ద పార్కు చేసి అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు అతని కోసం ఎంత వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో అతని భార్య సంధ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వినాయకుడికి ఎమ్మెల్యే రాజు పూజలు

బుచ్చెయ్యపేట, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో వడ్డాది దొరబాబు కాలనీలో వినాయకుడ్ని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు ఎంవీవీ సత్యనారాయణ, గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ శిరిగిరిశెట్టి శీరామూర్తి, తెలుగు యువత మండల అధ్యక్షుడు సింగంపల్లి రమేశ్, టౌన్ అధ్యక్షుడు దొండా నరేశ్, నాయకులు దొండా గిరిబాబు, దొండా సన్యాసిరావు, తలారి శంకర్ పాల్గొన్నారు.

వినాయకుడ్ని దర్శించుకున్న 'బూడి'

దేవరాపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వినాయకుడ్ని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వైసీపీ మండల అధ్యక్షుడు బాబూరావు, నాయకులు కేవీ.రమణ, జీవీ.అప్పలరాజు పాల్గొన్నారు.

మాడుగులలో మోస్తరు వర్షం..

మాడుగుల రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం మోస్తరు వర్షం పడిండి. ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు మాదిరిగా ఎండ కాసింది. అనంతరం వాతావరణం ఒక్కసారిగా మారిపోయి మోస్తరు వర్షం పడింది. ఈ వర్షం వరి పొలాలకు ఎంతో అనువుగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

కె.కోటపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాల నివారణకు డ్రోన్ కెమెరాతో నిఘా పెట్టామని ఎస్ఐ ఆర్.ధనుంజయ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం డ్రోన్‌ను ఎగురవేశారు. పరిసరాలు, గ్రామ పొలిమేరలు, శివారు ప్రాంతాలు, తోటలు, పార్కులు, బహిరంగ ప్రదేశాల్లో డ్రోన్ కెమెరాతో చిత్రీకరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, గంజాయి వినియోగం, చైన్ స్నాచింగ్ వంటి చట్ట వ్యతిరేక పనులను గుర్తించి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్ఐ స్పష్టం చేశారు. ప్రజల్లో చట్ట పాలనపై నమ్మకం కుదిరేందుకు ఈ డ్రోన్ నిఘా దోహదపడుతుందన్నారు.

అందుబాటులో యూరియా

గొలుగొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారి సుధారాణి తెలిపారు. పాతమల్లంపేట, పాకలపాడు, గుండుపాల, కొత్తమల్లంపేట, జోగంపేట, గొలుగొండ రైతు సేవా కేంద్రాల్లో ఎరువులతో పాటు యూరియా అందించేందుకు సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి, నాయకులు గెడ్డం నానాజీ పాల్గొన్నారు.

రైతులందరికీ ఎరువులు

గొలుగొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, వ్యవసాయాధికారుల పర్యవేక్షణలో ఎరువులు పంపిణీ చేస్తున్నామని తహశీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు నిల్వ ఉన్నప్పటికీ లేనట్టు ప్రచారాలు, ఆందోళనలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ఏడాది ఖరీఫ్‌నకు ఎరువులు, యూరియా సరపడా సిద్ధం చేసినట్టు తెలిపారు. యూరియాపై రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు.

40 టన్నుల యూరియా సిద్ధం

రావికమతం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు రైతు సేవా కేంద్రాలకు 40 టన్నుల యూరియా వచ్చిందని ఎంపీడీవో సీతారామస్వామి తెలిపారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గర్నికం, పి.పొన్నవోలు, గుడివాడ, గొంప రైతు సేవా కేంద్రాలకు పది టన్నుల చొప్పున కేటాయించామని ఆయన తెలిపారు. మండలంలోని 13 రైతు సేవా కేంద్రాలు ఉండగా, నాలుగు కేంద్రాలకు 40 టన్నుల యూరియాను ప్రభుత్వం సరపరా చేసిందన్నారు. మరో 150 టన్నుల యూరియా అవసరమని వ్యవసాయ శాఖ జేడీకి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. యూరియా పంపిణీలో అవకతవకలకు ఆస్కారం లేకుండా ఆయన స్పష్టం చేశారు. బస్తా యూరియా రూ.270కు మించి అమ్మకూడదని స్పష్టం చేశారు.

రోలుగుంటలో 20 టన్నులు..

రోలుగుంట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలానికి 20 టన్నుల యూరియాను అధికారులు సరఫరా చేశారు. వీటిలో రోలుగుంట పీఏసీఎస్‌కు పది టన్నులు, నిండుగొండ రైతు సేవా కేంద్రానికి పది టన్నుల యూరియా సరఫరా చేశారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులతో పాటు అవసరమైన మేరకు కొనుగోలు చేయాలని, మోతాకు మించి యూరియా వాడరాదని మండల వ్యవసాయాధికారి చిరంజీవి సూచించారు.

30 టన్నుల యూరియా పంపిణీ

బుచ్చెయ్యపేట సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం 30 టన్నుల యూరియా పంపిణీ చేసినట్టు ప్రత్యేకాధికారి గోపాలరాజు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డాది, పెదమదిన, కేపీ ఆగ్రహారం రైతు సేవా కేంద్రాల్లో పంపిణీ జరిగిందన్నారు. తహశీల్దార్ ఎం.లక్ష్మి, ఎంపీ డీవో భానోజిరావు, వ్యవసాయధికారి భాస్కరరావు, పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో యూరియాను పంపిణీ చేశామన్నారు. త్వరలో అన్ని రైతు సేవా కేంద్రాల్లో యూరియాను అందుబాటులో ఉంచుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమమలో నాయకులు ముచ్చకర్ల తాతీలు, గోపిశెట్టి శ్రీనివాసరావు, దేవర అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

తునివలసలో జ్వరాలు



జ్వరంతో బాధపడుతున్న విద్యార్థి, వృద్ధుడు

చీడికాడ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తునివలస గ్రామంలో ఇంటికొకరు చొప్పున జ్వరాలతో బాధపడుతున్నారు. వెంటనే ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు పాతాళం బాలకృష్ణ స్థానిక ఎంపీడీవోకు లిఖితపూర్వకంగా కోరారు. గ్రామంలో ఒకే ఇంటిలో పడాల ఈశ్వరమ్మ, రాజుబాబు, రేవంత్ జ్వరాలతో మగ్గుతున్నారని, కనీసం వైద్య సిబ్బంది స్పందించలేదని తెలిపారు. ఎంపీడీవో స్పందించి వెంటనే వైద్య శిబిరం ఏర్పాటుచేయాలని ఆయన కోరారు.

డీసీఎంఎస్ అభివృద్ధికి సహకరించండి

» సీఎం చంద్రబాబును కోరిన చైర్మన్ కోట్ని బాలాజీ


ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం ఇచ్చిన డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్-ఉమ్మడి విశాఖ జిల్లా) అభివృద్ధికి సహకరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కోరినట్టు సంస్థ చైర్మన్ కోట్ని బాలాజీ తెలిపారు. శుక్రవారం విశాఖ నగర పర్యటనకు వచ్చిన సీఎంను కలిసిన ఆయన.. డీసీఎంఎస్‌కు సంబంధించి పలు సమస్యలు, అంశాలపై వినతిపత్రం అందించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో డీసీఎంఎస్ ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు, విద్యార్థులకు పుస్తకాలు విక్రయించేందుకు అనుమతించాలని కోరారు. డీసీఎంఎస్‌కు చెందిన స్థలాలను వాణిజ్య కేంద్రాలుగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వ నిధులు కేటాయించాలని కోరగా, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించారని బాలాజీ తెలిపారు.

సీఎంను కలిసిన దక్షిణ కోస్తా రైల్వే జీఎం

విశాఖపట్నం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును దక్షిణ కోస్తా రైల్వే జోన్ జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ శుక్రవారం విజయవాడలో కలిసి జోన్‌లో జరుగుతున్న ప్రాజెక్టు పనులగురించి వివరించారు. ఆయనతో పాటు మరికొంతమంది రైల్వే అధికారులు కూడా వెళ్లి కొత్త జోన్ పనులు ఎక్కడి వరకూ వచ్చాయనేది తెలిపారు. విజయవాడ డీఆర్ఎం మోహిత్ సొనాకియా కూడా సీఎంను కలిసిన వారిలో ఉన్నారు.

సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ డీఎస్ఎన్ఎల్‌యూ సందర్శన

» అకడమిక్ బ్లాక్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభం
» హాజరైన ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్


అకడమిక్ బ్లాక్‌ను ప్రారంభించిన సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ. చిత్రంలో ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, వర్సిటీ వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు, పలువురు ప్రముఖులు

సబ్బవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాన్ని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.నరసింహ శుక్రవారం సందర్శించారు. విశాఖలో జరిగిన వర్సిటీ స్నాతకోత్సవంలో భాగంగా ఇక్కడకు వచ్చిన ఆయన.. ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌తో కలసి నూతన అకడమిక్ బ్లాక్, స్పోర్ట్స్ ఇండోర్ కాంప్లెక్స్‌ను ప్రారంభించి, మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య, జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మూట్ కోర్టు హాల్లో 'కాలమాన మార్పులు, చట్టం' అనే అంశంపై 'జస్టిస్ ఇ.వెంకటేశం ధార్మిక ఉపన్యాసం' చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మాదాసు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయక మండపంలో సెల్‌ఫోన్లు చోరీ

పరవాడ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడచీపురుపల్లి శివారు వెంకటాపురంలో ఐదు సెల్‌ఫోన్లు చోరీ అయినట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇక్కడ ముత్యమాంబ యూత్ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవ కమిటీకి చెందిన కూండ్రపు అశోక్, పైలా వంశీ, కూండ్రపు రవి, శిరపు నాయుడు, కె.జగదీశ్ మొబైల్ ఫోన్లను ప్యాంటు జేబుల్లో పెట్టుకుని గురువారం రాత్రి మండపం వద్ద నిద్రించారు. తెల్లవారుజామున లేచి చూసేసరికి సెల్‌ఫోన్లు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు తస్కరించారని, వీటి విలువ సుమారు రూ.1.1 లక్షలు వుంటుందని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎలమంచిలిలో వైరల్ జ్వరాలు

... 5వ పేజీ తరువాయి

తాగునీటి కోసం చేతిబోర్లను ఆశ్రయిస్తున్నామని మహిళలు చెబుతున్నారు. కాగా గొల్లలపాలెంతోపాటు పెదపల్లి, మంత్రిపాలెం ప్రాంతాల్లో కూడా వైరల్ జ్వరాలు ప్రబలాయని స్థానికులు చెబుతున్నారు. మునిసిపల్, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే స్పందించి గొల్లలపాలెంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

యువ న్యాయవాదులకు పట్టాభిషేకం

» ఉత్సాహంగా దామోదరం సంజీవయ్య లా వర్సిటీ స్నాతకోత్సవం
» ఐదు బ్యాచ్‌లకు ఒకేసారి నిర్వహణ
» అతిథులుగా హాజరైన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి
» 555 మంది విద్యార్థులకు పట్టాలు, 154 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రదానం



దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం సంయుక్త స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్. చిత్రంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పి.ఎస్.నరసింహ, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్, వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు ఉన్నారు

విశాఖపట్నం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విశాఖలోని నోవాటెల్‌లో నిర్వహించిన ఈ వేడు కకు సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ మాట్లాడుతూ న్యాయ విద్యార్థులు క్రమశిక్షణ, హార్డ్ వర్క్‌తో ఉన్నత స్థానాలను అధిరోహించేందుకు అవకా శముందన్నారు. న్యాయవాదిగానే కాకుండా టీచింగ్, జ్యుడిషియల్ ఆఫీ సర్ వంటి అనేక అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. సుప్రీంకోర్టు జడ్జి కావాలంటే కలగా భావించే వాడినని, అయితే. తాను జ్యుడిషి యల్ సర్వీసెస్ రాయడం ద్వారా ఈ స్థాయికి చేరుకున్నట్టు తెలిపారు. న్యాయవాద వృత్తిలో వేగం కంటే క్వాలిటీ ముఖ్యమన్నారు. రోజువారీ వృత్తిలో అనేక కొత్త సవాళ్లు ఎదురవ ుతుంటాయని, వాటిని ఎదుర్కొనే సహనం కావాలని సూచించారు. స్నాతకోత్సవ సభకు అధ్యక్షత వహించిన హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ విద్యార్థులతో ప్రమాణం చేయించారు. అనంతరం విద్యార్థులకు పట్టాలు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 154 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ పి.శ్రీనర్సింహ, వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశ్, రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ స్నాతకోత్సవంలో భాగంగా లా వర్సిటీ 8, 9, 10, 11, 12 బ్యాచ్‌లకు చెందిన 555 మంది విద్యార్థులకు పట్టాలను, మరో 154 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్‌ను ప్రదానం చేశారు. వీరిలో బీఏ ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన 397 మందికి, ఎల్ఎల్ఎం పూర్తి చేసిన 153 మందికి, పీహెచ్‌డీ పూర్తి చేసిన నలుగురు, ఎల్ఎల్‌డీ పూర్తి చేసిన ఇద్దరికి పట్టాలను అందించారు.

తల్లిదండ్రుల్లో అసంతృప్తి

పట్టాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఐదు బ్యాచ్‌లకు ఒకేసారి నిర్వహిం చడం పట్ల పలువురు తల్లిదండ్రులు అసంతృప్తిని వ్యక్తం చేశారు. కనీసం పట్టా తీసుకునేందుకు విద్యార్థులకు అవకాశం లేకుండా పోయిందని, గోల్డ్ మెడల్స్ తీసుకున్న వారికి ముఖ్య అతిథులతో ఫొటో దిగే అవకాశం ఇవ్వలేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కో బ్యాచ్ విద్యార్థులకు క్యాంపస్ ఆవరణలోనే ఏటా చేస్తే బాగుంటుందని పలువురు పేర్కొన్నారు.

మంచి న్యాయవాదిగా గుర్తింపు తెచ్చుకుంటా..

- బి సౌమ్య, గోల్డ్ మెడలిస్ట్



మంచి న్యాయవాదిగా గుర్తింపు తెచ్చుకోవా లన్నదే నా లక్ష్యం. న్యాయవాద వృత్తిలో ఎక్కువ మందికి సహాయం చేసేందుకు అవకాశం ఉంటుంది. అందుకే ఈ వృత్తిని ఎన్నుకున్నా. క్రిమినల్ అండ్ సెక్యూరిటీ లా సబ్జెక్టులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నందుకు గోల్డ్ మెడల్ లభించింది.

సుప్రీం కోర్టు న్యాయమూర్తి కావడమే లక్ష్యం


- కె.నితిన్, గోల్డ్ మెడలిస్ట్



మంచి న్యాయవాదిగా పేరు తెచ్చుకోవడంతో పాటు సుప్రీం కోర్టు జడ్జి కావాలన్న లక్ష్యంతో ఇటు వైపు వచ్చాను. అందుకు అనుగుణంగానే ప్రణాళికతో చదువు పూర్తి చేశాను. ఐపీసీ, లేబర్ లా, క్రిమినాలజీ, విక్టిమాలజీ అండ్ పీనాలజీ సబ్జెక్టుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గోల్డ్ మెడల్ వచ్చింది. చిన్నప్పటి నుంచి న్యాయవాద వృత్తి పట్ల ఆసక్తి ఉంది.

ఎక్కువ గోల్డ్ మెడల్స్ సాధించా..

- కె.లోకేశ్, గోల్డ్ మెడలిస్ట్



జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో బీఏ ఎల్ఎల్‌బీ పూర్తి చేశాను. అన్ని సబ్జెక్టులు, ఓవరాల్ పెర్ఫార్మెన్స్‌లో 35కు పైగా గోల్డ్ మెడల్స్ సాధించడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం తిరుపతిలో ప్రాక్టీస్ చేస్తున్నా. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ కావాలన్నది నా కల. ప్రస్తుతం ప్రాక్టీస్ కూడా అంకితభావంతో చేస్తున్నా. నాన్న నగేష్ అడ్వకేట్‌గా చేస్తున్నారు. ఆయన ప్రోత్సాహం, స్ఫూర్తితోనే ఈ రంగంలోకి వచ్చాను.

ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నదే ధ్యేయం

- ఎల్.రాణి వినోలియా, గోల్డ్ మెడలిస్ట్



రెండేళ్ల కిందట ఎల్ఎల్‌బీ పూర్తి చేశాను. ఇప్పుడు పట్టా అందుకుంటున్నా. ఫ్యామిలీ లా సబ్జెక్టులో గోల్డ్ మెడల్ లభించడం ఆనందంగా ఉంది. ఈ రంగంలో ఉన్నత స్థానానికి చేరుకోవా లన్నది నా లక్ష్యం. ప్రస్తుతం హైకోర్టులో సెక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్నాను. రెండేళ్ల కిందట ఈ ఉద్యోగం వచ్చింది. మంచి గుర్తింపు తెచ్చుకుని ఉన్నత స్థానానికి చేరుకునేందుకు ప్రయత్నిస్తాను.


గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యా/ అధ్యాపక పురస్కారాలు అందుకుంటున్న పీవీఎం నాగజ్యోతి (జడ్పీహెచ్ఎస్- రోలుగుంట), ఎల్.వెంకట నారాయణరావు (జడ్పీహెచ్ఎస్-గౌండుపాలెం), డీజీ నాథ్ (ఎంపీఎస్-నర్సీపట్నం), జి.చిన్నారావు (ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్- వడ్డాది)

ఖైదీల కలకలం

... 5వ పేజీ తరువాయి

ఇద్దరు రిమాండ్ ఖైదీలు, ఒక వార్డర్‌పై దాడి చేసి తప్పించుకున్న ఘటన పోలీసులను, జైళ్ల శాఖ అధికారులను ఉలికిపాటుకు గురిచేసింది

పరారైన ఖైదీలను త్వరలోనే పట్టుకుంటాం: ఎస్పీ తుహిన్ సిన్హా

చోడవరం సబ్‌జైలు నుంచి శుక్రవారం తప్పించుకున్న ఇద్దరు రిమాండ్ ఖైదీలను పట్టుకునేందుకు విశాఖపట్నం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల పోలీసుల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టామని, వీలైనంత త్వరగా వారిని అరెస్టు చేస్తామని ఎస్పీ తుహిన్‌సిన్హా ప్రకటించారు. రిమాండ్ ఖైదీలు పరారైన సబ్‌జైలును శుక్రవారం రాత్రి ఆయన సందర్శించారు. జరిగిన ఘటనపై పూర్తి వివరాలు సేకరించి సిబ్బందితో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, సబ్‌జైలు నుంచి రిమాండ్ ఖైదీలు పారిపోయిన సమాచారం తెలిసిన వెంటనే క్లూస్ టీమ్‌లను పంపించడంతోపాటు, అన్ని పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేశామన్నారు. వివిధ ప్రాంతాల్లోని చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రిమాండ్ ఖైదీలు పరారైన సంఘటనపై సిబ్బంది నిర్లక్ష్యం ఏమైనా వుందా అన్నది జైళ్ల శాఖ విచారణలో తేలుతేందన్నారు. రిమాండ్ ఖైదీల దాడిలో గాయపడిన వార్డర్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం బాగానే ఉందని, అతనికి మరిన్ని వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించామని ఎస్పీ తెలిపారు.

ఉపాధ్యాయులపై గురుతర బాధ్యత

... 5వ పేజీ తరువాయి

విద్యార్థుల తల్లిదండ్రుల ఫోన్ నంబర్లతో వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి విద్యార్థుల హాజరు, హోం వర్కు వివరాలు తెలియజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉత్తమ విద్యావేత్త అని, విద్యా రంగానికి ఆయన చేసిన సేవలు అనిర్వచనీయమని కొనియాడారు. అన్ని పాఠశాలల్లో యోగా తరగతులు నిర్వహించాలని కోరారు. విద్యాశాఖను మంత్రి నారా లోకేశ్ అత్యంత సమర్థనీయంగా నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 39 మందిని మంత్రి అనిత, ప్రజాప్రతినిధులు, అధికారులు సన్మానించి, ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, మళ్ల సురేంద్ర, డీఈవో గిడ్డి అప్పారావునాయుడు, డిప్యూటీ డీఈవో పి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూలో అవినీతి ఊడలు

... 5వ పేజీ తరువాయి

ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో భూముల రికార్డుల్లో మార్పులు, చేర్పుల్లో వీఆర్‌ఓలు, సర్వేయర్లే కీలక పాత్ర పోషిస్తూ సొమ్ములు వసూలు చేస్తుంటారు. భూముల విషయంలో తహశీల్దార్లకు అందిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ కోసం వీఆర్‌ఓలు, సర్వేయర్లను పంపుతుంటారు. ఈ క్రమంలో ఆయా దరఖాస్తుదారులతో వీఆర్‌ఓలు, సర్వేయర్లు బేరాలు కుదుర్చుకొని పనులు చక్కబెడుతుంటారు. లంచంగా అందుకున్న సొమ్ములో కింది నుంచి పైస్థాయి వరకు హోదానుబట్టి వారికి ముట్టజెబుతుంటారు. భూములకు సంబంధించి రెండు వర్గాల మధ్య ఏర్పడిన వివాదాల్లో వీఆర్‌ఓలు, సర్వేయర్లు జోక్యం చేసుకుంటున్నారు. అవి ప్రభుత్వ భూములైతే వీరు తెరవెనుక ఉండి ఫిర్యాదులు చేయిస్తారు. అనంతరం అక్కడ వాలిపోయి ప్రభుత్వ భూమి అంటూ యాగీ చేసి, ఇరువర్గాల నుంచి డబ్బులు దండుకుంటున్నారు. జాతీయ రహదారి పక్కనవున్న అనకాపల్లి, కశింకోట, ఎలమంచిలి, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో వివాదాలు ఎక్కువగా వున్న ప్రభుత్వ భూముల విషయంలో వీఆర్‌ఓలు, సర్వేయర్లు తలదూర్చుతున్నారు. రోలుగుంట తహశీల్దారు కార్యాలయంలో 2023లో ఏసీబీ సోదాలు అయ్యాయి. అప్పట్లో తహశీల్దారు, డిప్యూటీ తహశీల్దారు, వీఆర్‌ఓలు అవినీతికి పాల్పడినట్టు నిర్ధారణ కావడంతో కూటమి ప్రభుత్వం ఇటీవల తదుపరి విచారణకు ఆదేశించింది. అనకాపల్లి మండలం కోడూరులో ఏపీఐఐసీకి చెందిన సుమారు ఎకరా భూమిని గతంలో ఇక్కడ వీఆర్‌ఓగా పనిచేసిన ఒక వ్యక్తి తన కటుంబ సభ్యుల పేరున రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసుకొని, ఆ భూమిని మళ్లీ ప్రభుత్వానికే విక్రయించాడు. ఇదే గ్రామంలో 25 మందికి భూములు ఉన్నట్టు రికార్డులో చూపించి, ల్యాండ్ పూలింగ్ తరువాత ఆయా బినామీల పేర్లకు రూ.6 కోట్లకుపైగా పరిహారం చెల్లించే విధంగా పావులు కదిపారు. రెవెన్యూ శాఖపై పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు వస్తున్నప్పటికీ ఉన్నతాధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

క్రైం... crime news

తాచేరు గెడ్డలో జారిపడి గిరిజన మహిళ మృతి



కర్రల వంతెన మీదుగా మృతదేహాన్ని తీసుకువస్తున్న దృశ్యం. (ఇన్‌సెట్‌లో) మృతురాలు మచ్చమ్మ (ఫైల్)

మాడుగుల రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తాచేరు గెడ్డపై తాత్కాలికంగా నిర్మించిన కర్రల కాలివంతెనపై నుంచి ప్రమాదవశాత్తు జారి గెడ్డలో పడి గిరిజన మహిళ మృతి చెందిన సంఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని తాటిపర్తి పంచాయతీ అజయపురం గ్రామానికి చెందిన పీటీజీ మహిళ పాంగి మచ్చమ్మ (26) కూలీ పనుల నిమిత్తం గురువారం తాచేరు గెడ్డపై తాత్కాలికంగా నిర్మించిన కర్రల వంతెనను దాటి వెళ్లింది. సాయంత్రం పని ముగించుకుని తిరిగి కర్ర వంతెనపై నుంచి వెళుతుండగా ప్రమాదవశాత్తూ కాలు జారి గెడ్డలో పడిపోయింది. వర్షాల కారణంగా గెడ్డ ఉధృతంగా పారుతున్నందున ఆమె మునిగిపోయింది. స్థానిక యువకులు గెడ్డలో గాలించి ఆమెను బయటకు తీశారు. ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు 108 అంబులెన్స్‌కి సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది వచ్చి ఆమెను పరీక్షించి మృతి చెందినట్టు నిర్ధారించారు. ఈ విషయాన్ని మాడుగుల పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ నారాయణరావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మచ్చమ్మ భర్త మత్స్యరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గిరిజనుడి మృతి


విద్యుదాఘాతంతో మృతి చెందిన సన్యాసిరావు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొడిసింగి గ్రామానికి చెందిన వంతల సన్యాసిరావు(34) ఎన్టీఆర్ జిల్లా మైలవరం ఇటుకల బట్టీలో విద్యుదాఘాతంలో మృతి చెందాడు. భార్య సింగారి చెప్పిన సమాచారం మేరకు సన్యాసిరావు సోమవారం కూలి పని కోసం ఎన్టీఆర్ జిల్లా మైలవరం ఇటుకల బట్టీ వద్దకు వెళ్లాడు. అక్కడే ఉంటూ పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం విద్యుదాఘాతంతో మరణించినట్టు ఇటుకల బట్టీ యజమాని తెలిపారన్నారు. మృతుడికి నలుగురు పిల్లలు ఉన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కొత్తూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం కొండకొప్పాక ఇండస్ట్రియల్ పార్కుకు వెళ్లే రహదారిలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడని రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపారు. శుక్రవారం సంఘటనా స్థలానికి వెళ్లి విచారించగా, మృతిచెందిన వ్యక్తి మతిస్థిమితం లేకుండా ఈ ప్రాంతంలో తిరుగుతుండేవాని, హిందీలో మాత్రమే మాట్లాడడం గమనించామని స్థానికులు తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో సమీపంలోని ఒక హోటల్ వద్దకు వెళ్లి మంచినీరు తాగాడని, సాయంత్రం నాలుగు గంటల సమయంలో రోడ్డుపై పడపోయి మృతిచెందాడని చెప్పారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లేవని, సుమారు 35 ఏళ్ల వయస్సు ఉంటుందని ఎస్ఐ చెప్పారు. మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించామని, వివరాలు తెలిసిన వారు అనకాపల్లి రూరల్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

బొలేరో, ద్విచక్ర వాహనం ఢీ : ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన యువకులు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 5 (ఆంధ్ర జ్యోతి): మండలంలో కొండెంపూడి గ్రామంలో శుక్రవారం బొలేరో, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. బుచ్చెయ్యపేటలో వినాయకునికి పూలదండ కోసం గ్రామానికి చెందిన కొమర చిరంజీవి, కొమర నరేంద్ర ద్విచక్రవాహనంపై రావికమతం వెళ్లి వస్తుండగా కొండెంపూడి మరిడిమాంబ ఆలయం వద్ద బొలేరో వాహనం ఢీకొంది. దీంతో చిరంజీవికి తలకు బలమైన గాయం కాగా, నరేంద్రకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం చోడవరం ఆసుపత్రికి తరలించారు.

గడ్డర్‌ను ఢీకొన్న లారీ


టిప్పర్ లారీ ఢీకొనడంతో విరిగిపోయిన గడ్డర్

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి-అచ్యుతాపురం మార్గంలో పూడిమడక జంక్షన్ బైపాస్ రోడ్డుకు సమీపంలో పెను ప్రమాదం తప్పింది. మునగ పాక వైపు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన ఐరన్ గడ్డర్‌ను శుక్రవారం తెల్లవారుజామున టిప్పర్ లారీ ఢీకొన్నది. గడ్డర్ విరిగిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సిబ్బందితో వెళ్లి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

హుండీల చోరీ కేసుల్లో ఒకరి అరెస్టు, మరో ముగ్గురు మైనర్లు

అచ్యుతాపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నామని, వీరిలో ముగ్గురు మైనర్లు వున్నారని సీఐ నమ్మి గణేశ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత రెండు నెలల నుంచి రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల్లోగల పలు దేవాలయాల్లో చోరీలు జరుగుతున్నాయని, అందిన ఫిర్యాదుల మేరకు నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. శుక్రవారం ఉదయం మార్టూరు జంక్షన్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించినట్టు చెప్పారు. వీరు రాంబిల్లి మండలం పంచదార్ల గ్రామానికి చెందిన వారని, కరణం జయంత్ మేజర్ కాగా, మిగిలిన ముగ్గురు మైనర్లని తెలిపారు. పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించగా.. మండలంలోని జోగన్నపాలెం, మార్టూరు, దొప్పెర్ల, పైలావానిపాలెం, రాంబిల్లి మండలంలోని వెంకటాపురంలోని ఐదు దేవాలయాల్లో హుండీల చోరీకి పాల్పడినట్టు అంగీకరించారని పేర్కొన్నరు. నిందితుల నుంచి రూ.7,650 నగదు స్వాధీనం చేసుకొని, జయంత్‌ను అరెస్టు చేసి ఎలమంచిలి కోర్టులో హాజరుపరిచామని, మైనర్లను జువెనైల్ హోమ్‌కు పంపామని సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్ఐలు సుధాకర్, వెంకటరావు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	121.00
లైవ్ ధర	141.00
విత్ స్కిన్	252.00
స్కిన్ లెస్	262.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559